www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్   సంపుటి : 16   సంచిక : 107 సోమవారం, ఆగస్టు 31, 2026 , పేజీలు - 12   వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..



## నేడు వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం



- మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి
- నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం
- రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు

**అమరావతి, ఆగస్టు 30:**
మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, **మిగతాది 2లో...**

# ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

- 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' అవార్డును ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్
- 30కి పైగా అంతర్జాతీయ అవార్డులు అందుకున్న భారత నేతగా మోదీ రికార్డు
- తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు
- ఉజ్బెకిస్థాన్‌లో ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించిన ప్రధాని

**న్యూఢిల్లీ,ఆగస్టు 30:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది.



ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన **మిగతాది 2లో...**



# మరో జల ప్రళయం..?

## నేపాల్‌లో హై అలర్ట్ జారీ

- నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ
- నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు
- రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- హిమానీనదం విస్ఫోటనం తర్వాత మరో సంక్షోభంతో నేపాల్ ఆందోళన

**అమరావతి, ఆగస్టు 30:**
ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత **మిగతాది 2లో...**

# దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

- జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ
- మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు
- జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష
- సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ
- భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్



**న్యూఢిల్లీ,ఆగస్టు 30:**
దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష **మిగతాది 2లో...**

# 77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు







# మొక్కలు నాటే లక్ష్యం 81 శాతం పూర్తి

- ఇంటికో పండ్ల మొక్క..ఆరోగ్యానికి బంగారు బాట- వనమహోత్సవ పురోగతి సమీక్షలో మంత్రి సీతక్క



# మాజీ మంత్రి ధర్మాన పై కేసు

- బలవంతంగా గృహ ప్రవేశాలు చేయించారని ఆరోపణ
- ధర్మానతో పాటు మరో ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు
- గృహనిర్మాణ శాఖ డీఈఈ ఫిర్యాదుతో పోలీసుల చర్యలు
- హుద్‌హుద్ బాధితుల ఇళ్ల పంపిణీలో వివాదం

**అమరావతి,ఆగస్టు 30:**
వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుపై శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా గృహ ప్రవేశాలు చేయించారన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం **మిగతాది 2లో...**

# హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం

- రూ.500 కోట్ల భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే కుట్ర
- ఉపసంహరించుకోవాలని
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్
- సీఎం ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ




# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు
- 788కి పెరిగిన మృతుల సంఖ్య
- ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు




# ప్రచారం కోసమే జగన్పై నిందలు

## విజయసాయిపై సజ్జల ఫైర్

**అమరావతి,ఆగస్టు 30:**
వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి విజయసాయి రెడ్డి విమర్శలపై తీవ్రంగాస్పందించారు. విజయసాయిని జగన్ గతంలోఎంతో అభిమానించారని, ఇప్పుడు సొంత రాజకీయాల కోసం, ప్రచారం కోసం జగన్ ను, వైసీపీనిఆయన విమర్శించడం సరికాదని అన్నారు. విజయసాయి రెడ్డి సొంతంగా రాజకీయాలు చేసుకోవచ్చని, అయితే తమను టార్గెట్ చేస్తే మాత్రం గట్టిగాస్పందిస్తామని సజ్జల హెచ్చరించారు. విజయసాయి **మిగతాది 2లో...**



# ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పౌర పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే.

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

# మరో జల ప్రళయం..?

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది.టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది.

"భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్టు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది.

కొద్దిసేపటికే ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

# మాజీ మంత్రి ధర్మాన పై కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఆయనతో పాటు మరో ఏడుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గృహనిర్మాణ శాఖ శ్రీకాకుళం డీఈఈ వి.వి. సత్యాజీ అందజేసిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరణం సురేశ్ వెల్లడించారు. గతంలో హుద్‌హుద్ తుపాను బాధితులైన మత్స్యకార కుటుంబాల కోసం ప్రభుత్వం గృహాలను నిర్మించింది. పంపిణీ సమయంలో కొంతమంది లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో ఆయా ఇళ్లను ఖాళీగా ఉంచారు.

ఈ నేపథ్యంలో తమకు ఆ ఇళ్లను కేటాయించాలని కోరుతూ వైసీపీకి చెందిన కొందరు మత్స్యకారులు గతంలో కలెక్టరుకు విన్నవించుకున్నారు. అయితే, గత మే 14వ తేదీన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జడ్పీటీసీ సభ్యురాలు రుప్ప దివ్యతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు నిబంధనలకు విరుద్ధంగా ఆ ఇళ్లలోకి బలవంతంగా ప్రవేశించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డీఈఈ ఫిర్యాదు మేరకు మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సురేశ్ వివరించారు. ఈ పరిణామం ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది

# ప్రచారం కోసమే జగన్పై నిందలు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలను ఇకపై పట్టించుకోబోమని,పార్టీ నేతలు కూడా వాటికిప్రాధాన్యం ఇవ్వొద్దనిసూచించారు. జగన్ నాయకత్వాన్ని లక్ష్యంగాచేసుకుని వ్యక్తిత్వ హననం చేస్తున్నారని సజ్జల ఆరోపించారు. పేదల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిందిజగనేనని, వైసీపీకి సుదీర్ఘకాలం నాయకత్వంవహించే సత్తా ఆయనకే ఉందన్నారు. పార్టీని వీడినవారి గురించి జగన్ ఎప్పుడూ ప్రతికూలంగామాట్లాడలేదనిచెప్పారు. జగన్ మతమార్పిడులనుప్రోత్సహించారని విజయసాయి చేసిన ఆరోపణలుదారుణమని సజ్జల మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే జగన్, వైసీపీపైవిమర్శలు చేస్తున్నారని, విజయసాయి పబ్లిసిటీకోసమే ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

# నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

- రంగంలోకి భారత్, చైనా రెస్క్యూ బృందాలు
- 788కి పెరిగిన మృతుల సంఖ్య
- ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు



**ఖాట్మండ్ ఆగస్టు 30:** నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన ముప్పునకు మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆకస్మిక వరదలతో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం.. చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్‌బిలో 194, నవల్పరాసి వెస్ట్‌బిలో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌బిలో 52, ధాడింగ్‌బిలో 50, తున హున్‌బిలో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పో యారు. కాగా, నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారనీ, అందులో నేపాల్ పౌరులు ఉన్నారని ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ పేర్కొంది. గుర్తు తెలియని మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆస్పత్రులలో భద్రపరిచినట్టు వివరిం చింది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆస్ప త్రులలో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. మరోవైపు 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాం తాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొ చ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్ట లేనంతగా ఛిద్రమైన మృత దేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్య క్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి.

# దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ప్రకటించింది.

దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది.పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది.

పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అబ్జర్వర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్-టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది.

పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర..

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు.ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.





## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం..

**హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు..**

ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు, సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

# హైదరాబాద్‌లో భారీ భూ కుంభకోణం

**హైదరాబాద్, ఆగస్టు 30:** హైదరాబాద్‌లోని అజామాబాద్ పారిశ్రామిక వాడలో గల రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించే యత్నాన్ని విరమించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో ఉన్న భూమిని సదరు సంస్థకు కాకుండా ఇతరులకు అప్పనంగా ధారాదత్తం చేసేందు కు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్లో వందల కోట్ల విలువ గల భూమిని కాంగ్రెస్ పార్టీకి చెందిన అనుయాయులకు తక్కువ ధరకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెనక్కి తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలుగా ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో 3 ఎకరాల 23 గుంటల భూమి ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.87 కోట్లు చెల్లించడానికి సొంత ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నా, వారిని కాదని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడం వెనుక దాగిన కుట్రను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్ రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందని విమర్శించారు. 1987లోనే సుప్రీంకోర్టు ప్రయివేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలో తొక్కారని లేఖలో పేర్కొన్నారు. ఒక్క అజామాబాద్ అనే కాకుండా కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలిలోనూ కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ దందా నడిపిస్తోందని ఆరోపించారు. స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే భవిష్యత్‌లో గుడికి, బడికి, చివరికి స్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దు చేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల సొత్తును ప్రయివేట్ వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# 77వసారి ఢిల్లీకి సీఎం రేవంత్

- మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మంతనాలు

**హైదరాబాద్, ఆగస్టు 30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు ఢిల్లీ వెళ్తున్నారు. సెప్టెంబర్ 3వ తేదీన ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్తారని సీఎం కార్యాలయం మీడియాకు లీకులు ఇచ్చింది. సీఎం ఢిల్లీకి వెళ్లడం ఇది 77వ సారి. సీఎం వెంట పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార, మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా వెళ్తారని చెప్తున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ క్రమశిక్షణ వంటి అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో వీరు చర్చిస్తారని తెలిసిందిమంత్రివర్గ విస్తరణ మీద చర్చలు జరుగుతాయని సీఎంవో కార్యాలయం లీకులు వదిలింది. దీనిని అధికారిక పర్యటనగా చెప్పుకొనేందుకు రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలు, పెండింగ్‌లో ఉన్న కేంద్ర నిధుల విడుదల అంశాలపై సీఎం పలువురు కేం ద్ర మంత్రులతో భేటీ అయ్యేందుకు సమయం కోరినట్టు చెప్తున్నారు

# మొక్కలు నాటే లక్ష్యం 91 శాతం పూర్తి

**హైదరాబాద్, ఆగస్టు 30:**

రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, పచ్చని రాష్ట్రంతో పాటు ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో చేపట్టిన వనమహోత్సవ పురోగతిపై ఆదివారం సమీక్షించారు. కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మీతో కలిసి జిల్లాల వారీగా మొక్కలు నాటడం, ఇంటి ఆవరణల్లో మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడపై ఈ సమీక్షలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది శాఖ పరిధిలో 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 5.61 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీంతో లక్ష్యంలో 91 శాతం మేర మొక్కల నాటడం పూర్తయిందని తెలిపారు. గుంతల తవ్వకంలో కూడా 92 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు. జిల్లాల పనితీరును సమీక్షించిన మంత్రి సీతక్క, నిర్దేశించిన లక్ష్యాల సాధనలో అధికారులు చూపుతున్న చొరవపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని మంత్రి స్పష్టం చేశారు.నాటిన ప్రతి మొక్క బతికి ఎదగడమే వనమహోత్సవం అసలు విజయమని అన్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించడం, సంరక్షణ చర్యలు చేపట్టడం, మనుగడను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటి ఆవరణల్లో నాటేందుకు పెద్ద ఎత్తున మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పండ్ల మొక్కలను ప్రతి కుటుంబానికి చేరవేసే కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క పెంచడం అంటే కేవలం పచ్చదనం పెంచడం మాత్రమే కాదు.. కుటుంబ ఆరోగ్యానికి పెట్టుబడి పెట్టడం కూడా అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి పండ్ల మొక్కలను ఇంటి వద్ద పెంచుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు తాజా, సహజమైన పోషకాహారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క, ప్రతి గ్రామంలో విస్తారమైన పచ్చదనం ఉండేలా ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

## మంచుకొండల మాటున వినబడని ఘోష...మంజుల పత్తిపాటి

యాదాద్రి ఆగస్టు29

భారతదేశానికి హిమాలయాలు
కేవలం మంచుకొండలు కావు...
దేశానికి సహజ కవచాలు,
నదులకు జీవనధారలు,
వాతావరణానికి సమతుల్యాలు,
భారత భూభాగానికి
ప్రకృతి ప్రసాదించిన ప్రాణాధారాలు..!
మనం చూస్తున్న హిమాలయాలు
కేవలం పర్యాటక ప్రదేశాలు కావు...
తరతరాల భవిష్యత్తుకు
ప్రకృతి రాసిన భద్రతా పుటలు..!
కానీ మనకు రక్షణ కవచంలా ఉన్న
హిమాలయాల ఒడిలోకి వెళ్లి,
వినోదం పేరుతో విచ్చలవిడిగా
ప్రకృతి ఒడిని చెరిపేసి...
ప్రమాదాన్ని పిలిచింది మనమే..!
ఇది ట్రైలర్ మాత్రమేనని
ప్రకృతి చెబుతున్నా...
చెవిటివారిలా నటిస్తూ
చోద్యం చూస్తున్నది మనమే..!
హిమశిఖరాలు కరుగుతున్నాయంటే
హెచ్చరిక కాదా మనకు..?
ప్రకృతి కన్నెర్ర చేస్తున్నా
కనీసం సోయి ఉందా మనకు..?
నేపాల్‌లో నేడు ప్రకృతి ప్రకంపన..!
రేపు మన వంతు ఈ విధ్వంస వేదన..!
అందుకే ఇకనైనా మేల్కొందాం...
మొక్కలను నాటుదాం...
అడవులను కాపాడుదాం...
హిమాన్ని కాపాడుదాం...
భావితరాలకు కానుకగా ఇద్దాం...



రచన: శ్రీమతి మంజుల పత్తిపాటి
9347042218
ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్.
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం .

# శివ శివానిలో ఘనంగా రెండో సమవర్తన

- 700 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాల ప్రదానం
- విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి: ప్రొఫెసర్ బి. సుధాకర్‌రెడ్డి

















కొంపల్లిలోని శివ శివాని డిగ్రీ కళాశాల (అటానమస్)లో రెండో సమవర్తన--2026 కార్యక్రమం ఆదివారం హైదవ గౌరిక్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. వివిధ కోర్సులు విజయవంతంగా పూర్తి చేసిన దాదాపు 700 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి. సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో పొందిన విద్యా జ్ఞానాన్ని సమాజాభివృద్ధికి వినియోగించాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నూతన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ అధ్యక్షురాలు ఎస్. ఆరతి అధ్యక్షత వహించారు. వైస్ ప్రెసిడెంట్, డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి స్వాగతం పలికారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి పట్టభద్రులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. మమత అకడమిక్ నివేదికను సమర్పించారు. కళాశాల విద్యా ప్రమాణాల మెరుగుదల, నూతన కోర్సుల ప్రవేశపెట్టడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల ప్లేస్‌మెంట్లు అంశాల్లో సాధించిన పురోగతిని వివరించారు.

### ర్యాంకర్లకు నగదు బహుమతులు

వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులు ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొని తమ విద్యాభ్యాసంలో మరో ముఖ్యమైన మైలురాయిని పూర్తి చేసుకున్నారు.

# నిరుపేద కుటుంబానికి సర్పంచ్ చేయూత.

- మృతుడు ఇస్సుబ్ కుటుంబానికి బియ్యం పంపిణీ.



దౌల్తాబాద్ ఆగష్టు 30

దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి గ్రామానికి చెందిన దూదేకుల ఇస్సుబ్ గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో గాజులపల్లి గ్రామ సర్పంచ్ పంజ స్వామి తనవంతు సహాయంగా బియ్యం పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ పంజ స్వామి మాట్లాడుతూ.. ఇస్సుబ్ కుటుంబానికి అండగా నిలిచేందుకు తనవంతు సహాయం అందించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు తమకు తోచిన సహాయం అందించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్, వార్డు సభ్యులు మదర్ స్వామి, ఎం. రాజు, దాసరి స్వామి, కే. కరుణాకర్, గంగులు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# జీడిమెట్లలో 11.365 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్..

మరో నిందితుడి కోసం పోలీసుల గాలింపు



సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)

అక్రమంగా గంజాయిని తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 11.365 కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, గంజాయి తరలించేందుకు ఉపయోగించిన బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 29న కుత్బుల్లాపూర్‌లోని హెచ్‌ఎంటీ జంగిల్, పాత ప్రభుత్వ కళాశాల సమీపంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ దాడి చేసి మరేడుబూడి రాజు (33), సిరపు హేమ (41)ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద తనిఖీలు నిర్వహించగా ఐదు ప్యాకెట్లలో ఉన్న 11.365 కిలోల గంజాయి బయటపడింది. విచారణలో భాగంగా.. రాజు విశాఖపట్నం జిల్లా మాడుగుల సమీపంలో ఉన్న బుంపర రమణ వద్ద గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హేమకు గంజాయిని అప్పగించి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 814/2026, ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 20(బి)(ఐఐ)(బి) కింద కేసు నమోదు చేశారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఈ వ్యవహారంలో పరారీలో ఉన్న బుంపర రమణను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# నేడు కోటి మందితో 'భారత్ కో జానో' రాతపరీక్ష

--తెలంగాణలో లక్ష మంది విద్యార్థుల భాగస్వామ్యం

పద్మారావునగర్ ఆగస్టు 30

దేశ చరిత్ర, సంస్కృతి, విశిష్టతలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు 31న (నేడు) దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'భారత్ కో జానో' జనరల్ నాలెడ్జ్ రాతపరీక్ష నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు కోటి మంది, తెలంగాణలోని 21 శాఖల పరిధిలో దాదాపు లక్ష మంది విద్యార్థులతో ఈ పరీక్షను ఒకే రోజు, ఒకే సమయంలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర కృష్ణ పసుపులేటి, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు. ఈ పరీక్షను జూనియర్ (6, 7, 8 తరగతులు), సీనియర్ (9, 10, ఇంటర్) విభాగాలుగా విభజించి నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే దేశభక్తి, జాతీయ చైతన్యం, భారతీయ సంస్కృతి పట్ల గర్వభావాన్ని పెంపొందించి బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పరీక్షను విజయవంతం చేయడంలో పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దేశ సేవకు అంకితమైన వీర జవానుకు ఘన సత్కారం

- లెఫ్టినెంట్ కర్నల్‌గా పదోన్నతి పొందిన పల్లె నరేష్ గౌడ్‌కు ఏనుగు సుదర్శన్ రెడ్డి అభినందనలు



ఆగస్టు 30నారపల్లి,

మేడ్చల్ నియోజకవర్గం దేశ రక్షణలో విశిష్ట సేవలు అందిస్తూ లెఫ్టినెంట్ కర్నల్ హోదాకు పదోన్నతి పొందిన నారపల్లి గ్రామానికి చెందిన పల్లె నరేష్ గౌడ్‌కు మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ గౌడ్ సాధించిన విజయాన్ని అభినందిస్తూ ఆయన సేవలను కొనియాడారు. సన్మాన కార్యక్రమంలో నరేష్ గౌడ్ తల్లిదండ్రులు పల్లె బిక్షపతి గౌడ్, పల్లె మాధవిలను ప్రత్యేకంగా అభినందించిన ఏనుగు సుదర్శన్ రెడ్డి, దేశ రక్షణలో ఉన్నత స్థానాన్ని చేరుకోవడం కుటుంబానికి మాత్రమే కాకుండా నారపల్లి గ్రామానికి, మేడ్చల్ నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ దేశ భద్రతను కాపాడుతున్న సైనికులు నిజమైన దేశభక్తులని, వారి త్యాగాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తాయని అన్నారు. పల్లె నరేష్ గౌడ్ సాధించిన ఈ పదోన్నతి యువతకు ఆదర్శమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సైనిక దళాల సభ్యులకు, రక్షణ సిబ్బందికి దేశ ప్రజల తరఫున హృదయపూర్వక వందనాలు నాయకుడు బండారు పవన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకులు రాము యాదవ్, పోచారం డివిజన్ అధ్యక్షుడు సురేష్ నాయక్, పీర్జాదిగూడ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ఘట్కేసర్ మండల కార్యదర్శి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. దేశ సేవలో ప్రతిభ చాటుతూ లెఫ్టినెంట్ కర్నల్ హోదాకు చేరుకున్న పల్లె నరేష్ గౌడ్ విజయం మేడ్చల్ జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

# వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం..

## ఇద్దరు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం

**వికారాబాద్, ఆగస్టు 30 :** వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పరిగి మండలం గడిసింగపూర్ సమీపంలోని చింతల చెరువు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఖాజా బీ (65), జహంగీర్ బీ (78) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. సమచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కారులో ప్రయాణిస్తున్నారు. అబ్దుల్ హై అనే వ్యక్తి తన కారులో మరో ముగ్గురికి లిఫ్ట్ ఇచ్చాడు. నలుగురు కలిసి ప్రయాణిస్తుండగా పరిగి మండలం గడిసింగపూర్ సమీపంలోని చింతల చెరువు వద్ద ప్రమాదం జరిగింది. చింతల చెరువు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

# ఉద్యోగం, శిక్షణ పేరుతో రూ.2.25 లక్షల మోసం

**●సోషల్ మీడియా పరిచయంతో యువతిని నమ్మించి డబ్బులు వసూలు.. నిందితుడి అరెస్ట్**

**●ఉద్యోగాల పేరుతో సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: గోషామహల్ పోలీసులు**

ఉద్యోగం, శిక్షణ ఇప్పిస్తానంటూ ఓ యువతిని నమ్మించి రూ.2.25 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన నిందితుడిని గోషామహల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు క్రైమ్ నంబర్ 259/2026లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318(4) కింద కేసు నమోదు చేశారు.
పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం నందర్కన్‌పేట్‌కు చెందిన చాకలి ప్రవీణ్ కుమార్కు, ఫిర్యాదుదారురాలు పోకాల వైష్ణవికి 2025లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఉద్యోగం, శిక్షణ ఇప్పిస్తానని నిందితుడు ఆమెను నమ్మించినట్లు పోలీసులు తెలిపారు.
ఈ క్రమంలో 2025 ఫిబ్రవరి 22న బాధితురాలి ఇంటికి వెళ్లిన నిందితుడు బాండ్ పేపర్ రాసిచ్చి రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం డాక్యుమెంట్ వెరిఫికేషన్ పేరుతో రూ.50 వేలు, 2025 జూలై 9న డీడీ ఐడీ పేరుతో మరో రూ.25 వేలు ఆన్‌లైన్ ద్వారా వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విధంగా మొత్తం రూ.2.25 లక్షలు తీసుకున్న అనంతరం నిందితుడు ఫోన్ కాల్స్‌కు స్పందించకపో



వడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

**పక్కా సమాచారంతో నిందితుడి అరెస్ట్**

బాధితురాలి ఫిర్యాదుతో గోషామహల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పక్కా సమాచారం సేకరించిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించారు. ఈ క్రమంలో ఆగస్టు 29న సాయంత్రం 6 గంటలకు షాబాద్ మండలం నందర్కన్‌పేట్‌లో ప్రవీణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం రాత్రి 9.30 గంటలకు అతడిని అరెస్ట్ చేసి, 16వ ఏసీజేఎం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి ఒక శామ్‌సంగ్ గెలాక్సీ ఎం53 5జీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

**సోషల్ మీడియా ఉద్యోగ ప్రకటనలతో జాగ్రత్త**

ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగాలు, శిక్షణ, డిఫెన్స్ అకాడమీ ప్రవేశాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోషామహల్ పోలీసులు సూచించారు. ఏదైనా సంస్థకు డబ్బులు చెల్లించే ముందు దాని ప్రామాణికత, రిజిస్ట్రేషన్ వివరాలను స్వయంగా ధృవీకరించుకోవాలని తెలిపారు. అపరిచితుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయవద్దని, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే చాటింగ్ వివరాలు, స్క్రీన్‌షాట్‌లు, బ్యాంకు లావాదేవీల ఆధారాలను భద్రపరచుకుని పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిందితుడి చేతిలో మరెవరైనా మోసపోయి ఉంటే గోషామహల్ పోలీస్ స్టేషన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## తాడిచెట్టు నుండి పడిన నామాల వెంకటేష్ ను పరామర్శించిన...! కేజీ కేఎస్

**- జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య...!!**



**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 30**

జనగామ జిల్లా జనగాం మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన నామాల వెంకటేష తా/0 సత్తయ్య రోజు వారి వృత్తిలో భాగంగా ఆదివారం రోజున మధ్యాహ్నం 1 గంట30 నిమిషాలకు తాటి చెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో... ఖాజారి కిందపడడం జరిగింది. తోటి గీత కార్మికులు కుటుంబ సభ్యులు కలిసి జనగామ జిల్లా ఏరియా హాస్పిటల్ కు తీసుకువచ్చారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య వారిని పరామర్శించి... వారి ఆరోగ్య పరిస్థితి డాక్టర్ ని అడిగి తెలుసుకున్నారు. కుడి చెయ్యి విరిగిందని నడుముకు బలమైన దెబ్బలు తగిలిన సూచించారు. మెరుగైన వైద్యం కోసం హనుమకొండ, హైదరాబాద్ కన్నా తీసుకుపోమని సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రభుత్వం వెంకటేష్ కు మెరుగైన వైద్యం అందించాలని వారి కుటుంబానికి ఎక్స్ గ్రేషియా 5 లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ. వారితో పాటు ఖ+ఖూ. మండల అధ్యక్ష కార్యదర్శులు బాల్నే ఉమాపతి, తాళ్లపల్లి అశోక్, నాయకులు నామాల ఎల్లేష్ , నామాల రాజు, వెంకటేష్, ఉపేందర్, నామాల రాజు రవి ,నరసింహులు, రాజు, నామాల సిద్ధులు, చంద్రపాల్, తదితరులు ఉన్నారు.

# అనుమతులు లేని షెడ్డుకు రూ.5 లక్షల ముడుపులా..?

**●సర్వే నంబర్ 329 ప్రభుత్వ భూమిలో భారీ అక్రమ నిర్మాణం.. చకచకా సాగుతున్న పనులు!**

**●టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్రపై స్థానికుల్లో అనుమానాలు.. ఉన్నతాధికారులు స్పందించాలంటున్న ప్రజలు**



ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి లోని గాజులరామారం సర్కిల్--57లో, మహదేవపురం ప్రాంతంలోని సర్వే నంబర్ 329 ప్రభుత్వ భూమిలో భారీ షెడ్ నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండానే నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా నిబంధనల పేరుతో నోటీసులు, చర్యలు తీసుకునే అధికారులు.. ప్రభుత్వ భూమిలో భారీ షెడ్ నిర్మాణం జరుగుతున్నా ఎందుకు మౌనం వహిస్తున్నారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**రూ.5 లక్షల ముడుపులపై చర్చ ఎందుకు?**

ఈ అక్రమ షెడ్ నిర్మాణానికి సంబంధించి గాజులరామారం సర్కిల్--57 డీసీకి రూ.5 లక్షల వరకు ముడుపులు అందాయనే ఆరోపణలు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారికంగా ధృవీకరణ లేదు. ఒకవేళ ఈ ఆరోపణల్లో వాస్తవం ఉంటే.. ఇంత భారీ నిర్మాణం ఎలాంటి అడ్డంకులు లేకుండా చకచకా కొనసాగడానికి అధికారుల






అండదండలు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిలో నిర్మాణం జరుగుతున్న విషయం సంబంధిత అధికారులకు తెలియదా? తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? ఉంటే వాటిని ఎవరు మంజూరు చేశారు? అనుమతులు లేకపోతే ఇప్పటివరకు నిర్మాణ పనులను ఎందుకు నిలిపివేయలేదు? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిర్మాణ పనులు నిలిపివేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమైతే.. ప్రజా ఆస్తులకు రక్షణ ఎక్కడ? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నతాధికారులు విచారణ జరిపితే అసలు నిజాలు బయటకు!**

సర్వే నంబర్ 329లో జరుగుతున్న భారీ షెడ్ నిర్మాణంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి స్వరూపం, నిర్మాణదారుల వివరాలు, అధికారుల నుంచి జారీ అయిన నోటీసులు, ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరుతున్నారు. అదేవిధంగా రూ.5 లక్షల ముడుపుల ఆరోపణలపై కూడా విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేకపోతే ఆ విషయాన్ని అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం సాగుతున్నా అధికార యంత్రాంగం ఎందుకు కదలడం లేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

# ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ట పరచాలి

**-- కార్పొరేట్ ఫీజు దోపిడీని అరికట్టాలి**

**సిపిఎం మేడ్చల్ జిల్లా విద్యా సదస్సులో వక్తల పిలుపు**




**బాచుపల్లి, ప్రగతి నగర్**

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని సిపిఎం నాయకులు, విద్యావేత్తలు ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాచుపల్లి ప్రగతి నగర్‌లోని లీలా సుందరయ్య భవన్ లో నిర్వహించిన జిల్లా విద్యా సదస్సులో ఈ అంశాలపై విస్తృత చర్చ జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ మరియు ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగేశ్వర్ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వక్తలు మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు అడ్డుకట్ట వేయాలని, విద్య హక్కును ప్రతి విద్యార్థికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యారంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వ విధానాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై సదస్సులో చర్చించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, సిపిఎం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సదస్సు ముగింపులో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం ఆమోదించారు.

# విద్య, వైద్యంపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- ●ప్రభుత్వాల విధానాలతో విద్యలో అసమానతలు పెరుగుతున్నాయి
- ●విద్య, వైద్యం పూర్తిగా ప్రభుత్వ రంగంలోనే ఉండాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**హైదరాబాద్, ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)**
నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ అందించాలనే డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సీపీఎం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "విద్యాహక్కు--ప్రభుత్వాల బాధ్యత" అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు.జిల్లా కార్యదర్శి పి. సత్యం అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జాన్ వెస్లీ మాట్లాడుతూ.. ప్రభుత్వాల విధానాల కారణంగా పేద, ధనిక వర్గాల మధ్య విద్యలోనూ అసమానతలు పెరుగుతున్నాయని ఆరోపించారు. విద్య, వైద్య రంగాలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని డిమాండ్ చేశారు. ఈ రెండు రంగాల్లో కార్పొరేట్ శక్తుల ప్రభావం పెరుగుతోందని, ప్రైవేటీకరణ ద్వారా వారికి వేల కోట్ల రూపాయల ఆదాయానికి ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తున్నాయని విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యపై 15 శాతం నిధులు ఖర్చు చేస్తామని చెప్పినా ఎనిమిది శాతం కూడా ఖర్చు చేయడం లేదని జాన్ వెస్లీ ఆరోపించారు. కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం కేంద్ర ప్రభుత్వం విద్యపై ఆరు శాతం ఖర్చు చేయాల్సి ఉండగా మూడు శాతాన్ని కూడా దాటడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు విద్యా రంగం నుంచి తప్పుకోవడం వల్ల నిరుద్యోగం, పేదరికం, విద్యార్థుల డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి గ్రామపంచాయతీలో ఉన్నత పాఠశాల, ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, నియోజకవర్గ స్థాయిలో డిగ్రీ కళాశాల, జిల్లా స్థాయిలో పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో వేలాది పాఠశాలలను, కేంద్రంలో లక్ష పాఠశాలలను మూసివేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలకు సొంత ఇళ్లు లేవని, మరోవైపు దేశంలో కొద్దిమంది కుటుంబాల చేతుల్లో భారీగా సంపద కేంద్రీకృతమైందని జాన్ వెస్లీ పేర్కొన్నారు. సంపద కేంద్రీకరణే దేశంలో పేదరికానికి ప్రధాన కారణమని అన్నారు. ధనికులపై పన్నులు పెంచితే ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించవచ్చని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం, సరైన తరగతి గదులు, ఉపాధ్యాయుల నియామకం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఉచిత విద్య అంశంపై ఇప్పటికే ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, దేశ సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**ఎన్ఈపీతో విద్యారంగానికి నష్టం: ఆమంచి నాగేశ్వర్**
ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం ద్వారా దేశానికి నష్టమే ఎక్కువ జరుగుతుందని అన్నారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ పేరుతో విద్యా వ్యవస్థను తిరోగమన దిశగా తీసుకెళ్తున్నారని విమర్శించారు.ఉన్నత విద్య చదువుతున్న కొద్దీ నిరుద్యోగం పెరుగుతున్న పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో యువత విద్య, శిక్షణ, ఉపాధి రంగాలకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు.2035 నాటికి ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 50 శాతానికి పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, ఆన్‌లైన్, దూర విద్య, వృత్తి విద్య విధానాలపై ఎక్కువగా ఆధారపడటం వల్ల తరగతి గది విద్యకు సమానమైన నాణ్యత అందడం కష్టమని అన్నారు.వృత్తి విద్యలో సంప్రదాయ చేతివృత్తులను చేర్చడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను తిరిగి అదే వృత్తులకు పరిమితం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలలకు స్వయం ప్రతిపత్తి కల్పించడం ద్వారా మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టి విద్యను వ్యాపారంగా మార్చే అవకాశం ఏర్పడుతుందని విమర్శించారు.విద్యా వ్యవస్థను, తద్వారా దేశ భవిష్యత్తును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమంచి నాగేశ్వర్ పిలుపునిచ్చారు.అంతకుముందు విద్య ప్రాధాన్యతను తెలియజేస్తూ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజశేఖర్, రవి, శ్రీనివాస్, అశోక్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన రాజపేట పద్మశాలీలు.....

- వానలు కురవాలంటూ ప్రత్యేక పూజలు.....





**రాజాపేట ఆగస్టు 30**
రాజపేట మండల కేంద్రంలోని పద్మశాలి కులస్తులు ఆదివారం సామూహికంగా బోనాల పండుగ చేశారు. ఉదయం నుంచి పండుగ వాతావరణం కనిపించింది. వేకువ జామున తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి సాంప్రదాయ దుస్తులతో నెత్తిన బోనము పెట్టుకొని గ్రామదేవతలను దర్శించుకుంటూ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి గడికోటలోని పోచమ్మకు బోనాలు సమర్పించారు. వర్షాలు కురవాలని నైవేద్యం వండిన బోనం ను ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా అలంకరించారు. పోచమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు వానకాలంలో వర్షాలు సరిగా లేకపోవడంతో రైతులు ప్రజలు తాగు సాగునీరుకు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. డప్పు చప్పులతో కుటుంబ సభ్యులు బంధువులతో బోనాల పండుగ సాగింది. ఈ సందర్భంగా పద్మశాలి కులస్తుల నిర్వాహకులు బోనాల పండుగ విజయవంతం కోసం ఏర్పాట్లు చేశారు.

## వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి





**మేడ్చల్ మల్కాజిగిరి** జిల్లాలో ఘనంగా నిర్వహించిన వివాహ వేడుకల్లో రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ గారి వ్యక్తిగత సహాయకులు అముదల మల్లేష్ గౌడ్ వివాహం శ్రీ విద్యతో అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. అలాగే ఘనపూర్ మాజీ సర్పంచ్ బద్దం గోపాల్ రెడ్డి గారి కుమారుడు మిత్ర రెడ్డి వివాహం దీక్షితా రెడ్డితో కీసరలోని సూర్య కన్వెన్షన్‌లో అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ వివాహ వేడుకలకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం ఆనందంగా, సుఖసం తోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**తుర్కపల్లి ,ఆగస్టు 30**



తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు పెండెం రవి గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. నూతన గృహప్రవేశ కార్యక్రమంలో బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరై పెండెం రవి వారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా కలుసుకున్నారు. నూతన గృహంలో అడుగుపెట్టిన సందర్భంగా వారికి పట్టు బట్టలను సమర్పించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన గృహంలో కుటుంబ సభ్యులందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు. వారి కుటుంబంపై ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని నూతన గృహం సిరి సంపదలతో సుఖసంతోషాలతో కళకళలాడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆర్టీసీ టిటిఐ పెండెం బాల నర్సయ్య, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పెండెం శ్రీనివాస్, అడ్వకేట్ పడాల శ్రీనివాస్,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పిఆర్ఓ ఆదిమూలం సురేష్ పాల్గొన్నారు

# సీలింగ్ భూముల్లో రెవిన్యూ అస్త్రం..?

- -ఫలహారమౌతున్న ప్రభుత్వ భూమి..!
- -వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్..
- -ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ముడి మార్టిన్ పిర్యాదు.




**మేడిపల్లి : ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)**
సీలింగ్ భూములపై అక్రమార్కులు కన్నేశారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ సీలింగ్ భూములు రియల్ వ్యాపారుల పాలవుతున్నాయని, అక్రమార్కుల నుండీ ప్రభుత్వ భూమిని కాపాడాలని ఎంసీపీఐ(యూ) మేడిపల్లి మండల కార్యదర్శి ముడి మార్టిన్ సెక్రటేరియట్ నందు సీయం ప్రజావాణి లో పిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల కళ్ళుగప్పి ఏకంగా ఎకరాల కొద్దీ ప్రభుత్వ సీలింగ్ భూమిని కబ్జా చేసి కమర్షియల్ వెంచర్లుగా మార్చేస్తున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మేడిపల్లి మండలం పర్వతపూర్ సర్వే నెంబర్ 10 నందు వెలుగుచూసిన ఈ భారీ భూ కుంభకోణం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు.ఇంత పెద్ద ఎత్తున, దాదాపు కొన్ని ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిలో వెంచర్ పనులు జరుగుతుంటే స్థానిక రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని మార్టిన్ ప్రశ్నించారు.. సదరు నిర్మాణ దారులకు, కొంతమంది అధికారులకు మధ్య లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ?ప్రభుత్వ భూమిని అక్రమంగా ప్లాట్లు చేసి అమాయక ప్రజలకు అంటగట్టి కోట్ల రూపాయలు వెనకేసుకోవాలని చూస్తున్న అక్రమార్కుల పై కఠిన చర్యలు తీసుకొని సీలింగ్ భూమిని రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో స్థానిక రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

# జవహర్‌నగర్ టోల్ ప్లాజా వద్ద ముమ్మర తనిఖీలు

- ఎస్ఐ చల్ల రాజు ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు
-- వాహనదారుల్లో అప్రమత్తత





**ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 30 (పీపుల్స్ న్యూస్)**
ములుగు జిల్లా వెంకటాపూర్ మండల పరిధి జవహర్‌నగర్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ చల్ల రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది టోల్ ప్లాజా మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించడంతో పాటు వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనాల్లో అక్రమంగా ఎలాంటి వస్తువులు తరలిస్తున్నారా అనే కోణంలోనూ తనిఖీలు చేపట్టారు.అలాగే రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ఎస్ఐ చల్ల రాజు స్పష్టం చేశారు.

# “ప్రభుత్వ భూమి కబ్జా..

## మాజీ కార్పొరేటర్ హవా! అధికారుల మౌనం వెనుక మతలబేంటి?”




- ప్రభుత్వ భూమికి మాజీ కార్పొరేటర్ ఎసరు.. కబ్జా చేసి కోట్లు కొల్లగొట్టారా?
- 283 గజాల ప్రభుత్వ భూమి మాయం.. మాజీ కార్పొరేటర్ కబ్జా బాగోతం?
- ప్రభుత్వ భూమిపై మాజీ కార్పొరేటర్ పాగా.. నాలుగు అంతస్తుల నిర్మాణం ఎలా?
- కబ్జా కోరల్లో ప్రభుత్వ భూమి.. మాజీ కార్పొరేటర్‌పై ఆరోపణలు, అధికారులపై అనుమానాలు!
- ప్రభుత్వ భూమిని కబ్జా చేసి భవనం నిర్మాణం.. మాజీ కార్పొరేటర్‌కు అధికారుల అండదండలా?
- ప్రభుత్వ భూమి కబ్జా వెనుక మాజీ కార్పొరేటర్ హస్తం?.. రెవెన్యూ అధికారుల మౌనం ఎందుకు?
- ప్రభుత్వ భూమికి రక్షణ కరువు.. మాజీ కార్పొరేటర్ కబ్జా ఆరోపణలపై చర్యలు ఎప్పుడు?
- కబ్జాదారుల చేతిలో ప్రభుత్వ భూమి.. మాజీ కార్పొరేటర్‌పై సంచలన ఆరోపణలు!

**కుత్బుల్లాపూర్ : ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)**
ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారుల వైఖరి మరోసారి ప్రశ్నార్థకంగా మారింది. గాజుల రామారం పరిధిలోని సర్వే నంబర్ 329లో సుమారు 283 గజాల ప్రభుత్వ భూమిని మాజీ కార్పొరేటర్ ఆక్రమించారనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రభుత్వ భూమిపై ఆక్రమణ ఆరోపణలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు సంబంధిత అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ భూమి.. ప్రైవేట్ వినియోగమా?**
సర్వే నంబర్ 329లోని భూమి ప్రభుత్వ రికార్డుల్లో ఏ విధంగా నమోదై ఉంది? అందులో 283 గజాల స్థలం ఎవరి ఆధీనంలో ఉంది? ఆ స్థలానికి సంబంధించి ఏమైనా అనుమతులు లేదా హక్కు పత్రాలు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తే సాధారణ ప్రజలపై వెంటనే చర్యలు తీసుకుంటున్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన ఆరోపణల విషయంలో మాత్రం ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**సామాన్యుడికి ఒక లెక్క.. మాజీ కార్పొరేటర్‌కు మరో లెక్కా?**
“ప్రభుత్వ భూమిలో సామాన్యుడు చిన్న స్థలం ఆక్రమించినా అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారు. మరి మాజీ కార్పొరేటర్‌పై ఇంత తీవ్రమైన ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనం?” అంటూ స్థానికులు నిలదీస్తున్నారు. అధికారుల మౌనం వల్లే అనుమానాలు మరింత బలపడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి, ప్రభుత్వ రికార్డులతో క్షేత్రస్థాయి పరిస్థితులను సరిపోల్చాలని ప్రజలు కోరుతున్నారు.

**విచారణకు ఆదేశాలు ఇవ్వాలి**
సర్వే నంబర్ 329లోని 283 గజాల స్థలంపై పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, భూమి ప్రభుత్వానిదే అయితే ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ కార్పొరేటర్‌కు సంబంధించిన పత్రాలు, హక్కులు, అనుమతులను కూడా అధికారులు బహిర్గతం చేయాలని కోరుతున్నారు. ఆరోపణలు వాస్తవమా? లేక అపోహలా? అన్నది అధికారిక విచారణతోనే తేలనుంది. అయితే ఇప్పటివరకు చర్యలు లేకపోవడంపై మాత్రం ప్రజల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అధికారుల సమాధానం ఎప్పుడు?**
ప్రభుత్వ భూమి పరిరక్షణ విషయంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించి, సర్వే నంబర్ 329పై వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమి విషయంలో వ్యక్తి స్థాయి, రాజకీయ నేపథ్యం చూడకుండా అం దరికీ ఒకే చట్టం వర్తించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

## ఎన్టీపీసీలో వ్యర్థాల వేరుచేసే విధానంపై అవగాహన సదస్సు




**రామగుండం,ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)**
రామగుండం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో పనిచేస్తున్న వ్యర్థాల సేకరణ కార్మికులకు వ్యర్థాల వేర్పాటు, సురక్షిత నిర్వహణపై ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో ఎలా పారవేయాలో, సేకరణ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఈ సందర్భంగా నిపుణులు వివరించారు. తడి, పొడి వ్యర్థాలను ఇళ్ల వద్దనే (ప్రారంభ దశలోనే) వేరు చేయడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని, పునర్వినియోగానికి (రీసైక్లింగ్) పనికివచ్చే పదార్థాలను సమర్థవంతంగా వాడుకోవచ్చని తెలిపారు. వ్యర్థాల సేకరణ, రవాణా సమయంలో కార్మికులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన టౌన్‌షిప్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుకావాలని నిర్వాహకులు కోరారు.

## రామగుండం ఎన్టీపీసీలో వ్యర్థాల నిర్వహణపై అవగాహన







**రామగుండం : ఆగస్టు30 (పీపుల్స్ న్యూస్)**
ఎన్టీపీసీ రామగుండం పర్యావరణ నిర్వహణ విభాగం (ఈ ఎం జీ) ఆధ్వర్యంలో టౌన్‌షిప్ వ్యర్థాల సేకరణ కార్మికులకు వ్యర్థాల వేరు చేయడంపై ఆదివారం ఎన్టీపీసీ టౌన్ షిప్ లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యర్థాలను మూలస్థాయిలోనే సక్రమంగా వేరు చేయడం, సురక్షితంగా నిర్వహించడం, శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం వంటి ముఖ్యమైన అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. వ్యర్థాల సేకరణ, రవాణా సమయంలో సైతం తడి, పొడి వ్యర్థాల విభజనను ఖచ్చితంగా కొనసాగించాలని, పునర్వినియోగానికి అనువైన వ్యర్థాలను రీసైక్లింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారు.

**వేస్ట్ టు వ్యాల్యూ' కార్యక్రమానికి విశేష స్పందన**
అనంతరం ఈ ఎం జీ విభాగం, గౌతమి నగర్‌లోని డి ఆర్ సి సి(డ్రై వేస్ట్ రీసోర్స్ కలెక్షన్ సెంటర్) సహకారంతో టౌన్‌షిప్ నివాసితుల కోసం 'వేస్ట్ టు వ్యాల్యూ -- ఎర్న్ ఫ్రమ్ వేస్ట్' ప్రోగ్రామ్‌ను చేపట్టింది. ఈ కార్యక్రమంలో నివాసితులు స్వచ్ఛందంగా పాల్గొని ఇళ్లలో వేరు చేసిన పేపర్, కార్డ్‌బోర్డ్, ప్లాస్టిక్, ఇనుము, ఇతర లోహాలు, గాజు వంటి పొడి వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం అందించారు. వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేయడం వల్ల పర్యావరణానికి జరిగే మేలుతో పాటు పునర్వినియోగ వ్యర్థాలకు ఆర్థిక విలువ కూడా లభిస్తుందని నిర్వాహకులు వివరించారు. బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, వ్యర్థ రహిత టౌన్‌షిప్ నిర్మాణానికి ఎన్టీపీసీ నిరంతరం కట్టుబడి ఉంటుందని నిర్వాహకులు స్పష్టం చేశారు.

## హలోమాల చలో సెక్రటేరియట్ ని విజయవంతం చేయండి..

**- మాల మహానాడు నాయకుడు అల్లిబిల్లి మహేందర్**

**శేరిలింగంపల్లి : ప్రతినిధి శ్రవణ్ కుమార్ ఆగస్టు 30(పీపుల్స్ న్యూస్**) ఈనెల 31న జరుగనున్న “హలో మాల చలో సెక్రటేరియట్ “కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మాల మహానాడు నాయకుడు డాక్టర్ అల్లిబిల్లి మహేందర్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ గవర్నమెంట్ ఉత్సవాల కమిటీ కో -చైర్మన్, జాతీయ మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో, విద్యా,ఉద్యోగ రంగంలో మాలలకు జరుగుతున్న టువంటి అన్యాయాన్ని నివారించేశీదుకు రోస్టర్ విధానాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ , జాతీయ మాల మహానాడు తెలంగాణ




అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు ఈనెల 31 తేదీన హలోమాల చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రతి మాల కుటుంబం నుండి విద్యార్థులు,యువకులు, పెద్దలు, అందరూ స్వచ్ఛందంగా బయటికి వచ్చి ఈ యొక్క కార్యక్రమంలో, పాల్గొని విజయవంతం చేసి మాలల హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ నుండి జపాన్ కు పెబ్బేరు ఉపాధ్యాయుడు ఎంపిక



**పెబ్బేరు,ఆగస్టు 30** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జపాన్ విద్యా పర్యటనకు పెబ్బేరు మున్సిపల్ కేంద్రానికి చెందిన పి.మురళీకృష్ణ ఎంపికయ్యారు. ప్రస్తుతం పెబ్బేరు మండలం యాపర్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్జిటిగా విధులు నిర్వహిస్తున్నారు.సెప్టెంబర్ 5 నుండి 12 వరకు జరిగే ఈ పర్యటనకు రాష్ట్రం నుండి 29 మంది ఉపాధ్యాయులు, 11 మంది అధికారులు వెళు తున్నారు.ఈ సందర్భంగా ఆదివారం ఆయన మిత్రబృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటన్నగౌడ్, సామాజికవేత్త వల్లపురెడ్డి శ్రీధర్ రెడ్డి, మేకల రమేష్ యాదవ్, వెంకటేశ్ యాదవ్, లక్ష్మయ్య యాదవ్, శ్రీనాథ్, వెంకటేష్, గిరిజ గౌడ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తుంగభద్ర పవిత్ర జలాల కోసం కపటి యువత పాదయాత్ర

**- కపటి లక్ష్మీనరసింహస్వామికి ఘనంగా ప్రత్యేక పూజలు, అభిషేకం**



**కపటి, 30 ఆగష్టు ) :** శ్రావణమాసం సందర్భంగా కపటి గ్రామ యువత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న సంప్రదాయ పాదయాత్రను ఈ ఏడాది కూడా ఘనంగా కొనసాగించారు. గ్రామం నుంచి మంత్రాలయం వరకు పాదయాత్రగా వెళ్లిన సుమారు 50 మంది యువకులు తుంగభద్ర నది నుంచి పవిత్ర జలాలను సేకరించి గ్రామానికి తీసుకువచ్చారు.ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని యువత ముందుండి కొనసాగించడం విశేషంగా నిలిచింది. తుంగభద్ర నది నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో కపటి గ్రామంలోని ఓబులేసు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రావణమాసంలో ప్రతి ఏటా నిర్వహించే ఈ పాదయాత్ర కపటి గ్రామ ప్రజల భక్తి విశ్వాసాలకు, సంప్రదాయ పరిరక్షణకు, యువత ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది.యువత చొరవతో కొనసాగుతున్న ఈ కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు.

# మంథని బస్టాండ్ లో బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు...!!

**- ప్రతి పావు గంటకో ఆర్డినరీ బస్సు అందుబాటులో ఉంచాలి...**

**- ఎక్సప్రెస్ బస్సులో ఎక్కిన సామాన్యులను మధ్యలోనే దింపడం మానుకోవాలి...**




**మంథని, 30 ఆగష్టు** బస్టాండ్ లో సరైన సమయంలో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని " భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య,"డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు.మహాలక్ష్మీ పతకం తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది,కానీ మంథని డిపోలో మాత్రం బస్సుల సంఖ్య పెరగలేదు.ఫలితంగా గంటల తరబడి బస్టాండ్ లోనే వేచి ఉండాల్సి వస్తుంది.వృద్ధులు , విద్యార్థులు, మహిళలు ప్రతి రోజు పడిగాపులు కాస్తున్నారు.మంథని నుండి కరీంనగర్, గోదావరిఖని, పెద్దపల్లి రూట్లలో ప్రతి పావు గంటకు ఒక ఆర్డినరీ బస్సును అందుబాటులో ఉంచాలని.ఆర్డినరీ బస్సులను ఎక్స్ ప్రెస్ లుగా మార్చి ఎక్కువ చార్జీలు వసూలు చేస్తూ ఎక్సప్రెస్ బస్సులో ఎక్కినా సామాన్యులను మహిళను వృద్ధులను ఎక్కడ పడితే అక్కడ మధ్యలో దింపడం చేయడం మానుకోవాలి.పండుగలు, ఆదివారం, సోమవారం,రద్దీ రోజుల్లో ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు వేంటనే స్పందించి బస్సులు పెంచకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బస్టాండ్ ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు.

# గూడుమల్కాపూర్ మార్కెట్‌లో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన






**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని కులసుంపురా ట్రాఫిక్ పోలీసులు సూచించారు. 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం గూడుమల్కాపూర్ మార్కెట్ ఆవరణలో మార్కెట్ కమిటీ సభ్యులు, నాలుగు చక్రాల వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వాహనదారులు, డ్రైవర్లు తప్పనిసరిగా పాటించాల్సిన పలు నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు, వాహన యజమానులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, మద్యం లేదా ఇతర మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు. ఓవర్‌టేక్ చేసే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఎడమ వైపు నుంచి ప్రమాదకరంగా ఓవర్‌టేక్ చేయరాదని సూచించారు.రహదారిపై ప్రయాణించే ఇతర వాహనదారులు, పాదచారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని పోలీసులు కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడంతో పాటు, ప్రమాదాలను నివారించేందుకు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ఆవశ్యకతను వివరించారు.

# నీట్ పరీక్ష కేంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీలు









**మేడ్చల్--మల్కాజిగిరి, ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్, మేడిపల్లి మండలాల పరిధిలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు.నాగోల్‌లోని సీఐఓఎస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిర్జాదిగూడలోని సూర్య టెక్నాలజీ, మేడిపల్లిలోని మేడిపల్లి కాలేజీలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించడంతో పాటు, వివిధ విభాగాల్లో జరుగుతున్న పరీక్ష ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, నిబంధనల ప్రకారం పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, అధికారులు నిర్వహిస్తున్న విధులు తదితర అంశాలను కూడా ఆయన పరిశీలించారు. పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి తహసీల్దార్, సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీపీసీ రామగుండంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- ఉత్సాహంగా సాగిన 3కే రన్
- ప్రారంభించిన ఈడీ చందన్ కుమార్ సమంత
- పాల్గొన్న 226 మంది ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

















జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం ఎన్టీపీసీ టౌన్ షిప్‌లోని ఎంజీ స్టేడియంలో ఆదివారం ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో '3కే రన్' ఉత్సాహపూరిత వాతావరణంలో చేపట్టారు.ఈ రన్‌ను ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆర్అండ్‌టీ) చందన్ కుమార్ సమంత జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు నిత్య జీవితంలో క్రీడలు, వ్యాయామాన్ని భాగం చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**ఉత్సాహంగా పాల్గొన్న బాలబాలికలు, మహిళలు**

ఈ 3కే రన్‌లో వివిధ వయసు విభాగాలకు చెందిన మొత్తం 226 మంది పాల్గొన్నారు. 45 ఏళ్లకు పైబడిన విభాగంలో 40 మంది పురుషులు, 6 మంది మహిళలు; 45 ఏళ్లలోపు విభాగంలో 90 మంది పురుషులు, 50 మంది మహిళలతో పాటు 40 మంది బాలబాలికలు ఉత్సాహంగా పరుగు తీశారు.

దైనందిన కార్యాలయ వాతావరణానికి అతీతంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఒకచోట చేరి క్రీడాస్ఫూర్తిని, సమైక్యతను చాటుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ 3కే రన్ ఎన్టీపీసీలో నిర్వహించిన క్రీడా దినోత్సవ వేడుకల్లోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# బీఆర్ఎస్‌లో ఉన్నానంటూ.. కాంగ్రెస్ సభల్లో ఏంటి పని?

●అరెకపూడి గాంధీ ద్వంద్వ వైఖరిపై బీఆర్ఎస్ నేత బొబ్బ నవతారెడ్డి ఫైర్

●స్వలాభం కోసం ప్రజలను మభ్యపెడుతున్నారు.. PAC పదవికి రాజీనామా చేయాలి

●రానున్న రోజుల్లో శేరిలింగంపల్లి ప్రజలు తగిన బుద్ధి చెబుతారు: నవతారెడ్డి










**శేరిలింగంపల్లి : ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)** బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని చెబుతూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొనడం ఏమిటని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ప్రశ్నించారు. ఒకవైపు బీఆర్ఎస్‌లో ఉన్నానని చెప్పుకుంటూ మరోవైపు కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యే ద్వంద్వ వైఖరిపై ఆమె తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ.. స్వలాభం, పదవుల కోసం అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గాంధీ వ్యవహారశైలిని శేరిలింగంపల్లి ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**కాంగ్రెస్ సభలో ఎమ్మెల్యే పాల్గొనడంపై అభ్యంతరం**

మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2 కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ బీఎల్ఏలు, కార్యకర్తలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల నేపథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొనడంపై నవతారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీ మారలేదని చెబుతూ కాంగ్రెస్ పార్టీ అంతర్గత కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులతో కలిసి వేదికను పంచుకోవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

**ప్రజలను ఇంకా ఎన్నాళ్లు మభ్యపెడతారు?**

ఎమ్మెల్యే గాంధీ తన ద్వంద్వ వైఖరితో శేరిలింగంపల్లి ప్రజలను మభ్యపెడుతున్నారని నవతారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలకు మద్దతు ఇస్తూ, ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న వ్యక్తి తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు.

ఓటు హక్కు, ఓటు రక్షణ గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్న సభలో.. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే మరో పార్టీ కార్యక్రమంలో పాల్గొనడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ఆమె వ్యాఖ్యానించారు.

**హుడా పదవికి రాజీనామా చేయాలి**

పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఎమ్మెల్యే గాంధీ ఇలాంటి రాజకీయ వైఖరిని అవలంబిస్తున్నారని నవతారెడ్డి ఆరోపించారు. ఆయన రాజకీయ వ్యవహారశైలిని శేరిలింగంపల్లి ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని, తనను నమ్మి ఓటేసిన ప్రజలను మోసం చేస్తున్నారనే ఆరోపణలపై ఎమ్మెల్యే గాంధీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లయితే బహిరంగంగా ప్రకటించి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, అలాగే హుడా చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని బొబ్బ నవతారెడ్డి డిమాండ్ చేశారు.

## కౌతాళం మండలంలో పలు వివాహ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి మరియు కౌతాళం మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి



**కౌతాళం, ఆగష్టు 30** ఆదివారం రోజున కౌతాళం మండలం నందు కౌతాళం వాస్తవ్యులైన ఎన్టీఆర్ నగర్ కిష్టప్ప కుమార్తె, మరియు ఉప్పర్ మల్లి,వడ్డే చిన్న హుసేని కుమారుడు లింగలదిన్నె గోపాల్ నూతన దంపతులను సుఖశాంతులతో,ఆయురారోగ్యాలతో సాగాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. మరియు వారిని పూలమాలతో శాలువతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, కౌతాళం మాజీ సర్పంచ్ పాల్ దినకర్,ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య,వడ్డే రాము, అవతారం, సుగురప్ప,వడ్డే చిన్న ఉసేని, ఆదినారాయణ రెడ్డి, రామకృష్ణ, సక్రి.శ్రీరామ్, బెస్తా మగ్రిస్వామి,వడ్డే ఆంజి,ఎన్టీఆర్ నగర్ భాషా,ఎంపీటీసీ మూఖన్న మరియు సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగినది.

# పల్లి కోటిని వెంటనే అరెస్ట్ చేయాలి: పల్లమాల రవి



**చిల్లకూరు, 30 ఆగష్టు** గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్‌పై సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేయడం, ప్రెస్‌మీట్లు నిర్వహించి ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని చిల్లకూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లమాల రవి అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిల్లకూరు మండలంలో సమాచార హక్కు చట్టాన్ని అడ్డం పెట్టుకొని నాడు--నేడు కార్యక్రమం, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల్లో సమర్పించిన అర్జీలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. దర్యాప్తు అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని పల్లమాల రవి కోరారు. ప్రజాప్రతినిధులపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌పై తప్పుడు ప్రచారాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

# రేషన్ బియ్యం పంపిణీ గడువు సెప్టెంబర్ 10 వరకు పొడిగించాలి

**ఆగస్టులో బియ్యం అందుకోలేకపోయిన పేదలకు మరో అవకాశం కల్పించాలి: కుతాడి శివరాజ్**




**కరీంనగర్, 30 ఆగస్టు**

ఆగస్టు నెలలో ప్రభుత్వ సెలవులు, ఇతర పరిపాలనా కారణాల వల్ల అనేక రేషన్ దుకాణాల్లో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగలేదని తెలంగాణ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు. దీంతో పలువురు రేషన్ కార్డుదారులు తమకు కేటాయించిన బియ్యాన్ని అందుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలిపారు. రేషన్ కార్డు ఉన్నప్పటికీ అనేక నిరుపేద కుటుంబాలు తమకు కేటాయించిన మూడు నెలల రేషన్ బియ్యాన్ని పొందలేకపోయా యని పేర్కొన్నారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు, పేద కుటుంబాలు రేషన్ బియ్యంపైనే ఆధారపడి జీవిస్తున్నందున బియ్యం అందకపోవడం వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ప్రభుత్వ సెలవులు, పరిపాలనా కారణాల వల్ల రేషన్ దుకాణాలు సక్రమంగా పనిచేయకపోతే దాని ప్రభావం పేదలపై పడకూడదని కుతాడి శివరాజ్ పేర్కొన్నారు. ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ గడువును సెప్టెంబర్ 10వ తేదీ వరకు పొడిగించి, ఇప్పటివరకు బియ్యం తీసుకోలేకపోయిన ప్రతి అర్హత కలిగిన రేషన్ కార్డుదారుడికి బియ్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ బియ్యం పేదల హక్కు అని, ప్రభుత్వ సెలవులు లేదా పరిపాలనా కారణాల వల్ల పేదలు తమ హక్కును కోల్పోకూడదని అన్నారు. సెప్టెంబర్ 10 వరకు గడువు పొడిగిస్తే బియ్యం అందుకోలేకపోయిన నిరుపేద కుటుంబాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి, రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి బియ్యం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రేషన్ బియ్యం పంపిణీ గడువును సెప్టెంబర్ 10 వరకు పొడిగించాలని తెలంగాణ జనతా పార్టీ తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రామప్ప దేవాలయంను సందర్శించిన జర్మనీ దేశస్తులు

















**వెంకటాపూర్ ( రామప్ప) ములుగు జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 30( పీపుల్స్ న్యూస్)** మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను అదివారం జర్మనీ దేశానికి చెందిన కేబ్లిజ్ యంగ్, యులి స్టేయింబ్, చీకో స్ట్రాన్ లుసందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. . ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ బ్యుటిపుల్ టెంపుల్ రామప్ప అని అన్నారు. అనంతరం రామప్ప చెరువు సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలిసులు, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు

# పెబ్బేరు బైపాస్ ల వద్ద ఫ్లైఓవర్ల కోసం కేంద్రమంత్రికి వినతి



**పెబ్బేరు, ఆగస్టు 30 :** పట్టణంలోని జాతీయ రహదారి ఎన్ హెచ్ 44పై రెండు బైపాస్ ల వద్ద ఫ్లైఓవర్లు, సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ ఆదివారం భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కర్నూలు,హైదరాబాద్ బైపాస్ ల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే పలువురు మృతి చెందారని, మరికొందరు తీవ్రంగా గాయపడి శాశ్వత వికలాంగులుగా మారారని వినతి పత్రంలో పేర్కొన్నారు.డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు, ఫిషరీస్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు, రైతులు, వివిధ గ్రామాల ప్రజలు నిత్యం ప్రాణాలకు తెగించి రహదారి దాటాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులు, రైతులు, ప్రజల భద్రత దృష్ట్యా ఈ అంశాన్ని నేషనల్ హైవే అథారిటీ దృష్టికి తీసుకెళ్లి సర్వీస్ రోడ్డు, రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంథని మండల కళాకారుల కమిటీ నియామకం



**మంథని, ఆగస్టు 30 :**
కళామతల్లి ముద్దుబిడ్డలైన కళాకారులందరూ ఏకమై ఆదివారం మంథని మండలం కళాకారుల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, రాష్ట్ర సలహాదారుడు అబ్బిడి రాంరెడ్డి, పెద్దపల్లి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పిడుగు శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.నూతన కమిటీ అధ్యక్షులుగా నాగెల్లి ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులుగా వేముల లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా అమ్మకుంటి మల్లేష్ యాదవ్, కోశాధికారిగా రొడ్డ శ్రీనివాస్, కార్యదర్శులుగా బాస అశోక్ కుమార్ యాదవ్,మూత రమేష్,రొడ్డ రవీందర్,సోదారి శ్రీధర్, మాధవరావు, కిష్టయ్య, కార్యవర్గ సభ్యులుగా కొప్పుల రాజయ్య, గాజుల మల్లేష్, మద్దెల రవిలు ఎన్నికైయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ కళాకారులందరి తరుపున శుభాకాంక్షలు తెలియజేశారు.

# వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం




**వికారాబాద్, ఆగస్టు 30 :** వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. పరిగి మండలం గడిసింగపూర్ సమీపంలోని చింతల చెరువు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఖాజా బీ (65), జహంగీర్ బీ (78) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. సమచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కారులో ప్రయాణిస్తున్నారు. అబ్దుల్ హై అనే వ్యక్తి తన కారులో మరో ముగ్గురికి లిఫ్ట్ ఇచ్చాడు. నలుగురు కలిసి ప్రయాణిస్తుండగా పరిగి మండలం గడిసింగపూర్ సమీపంలోని చింతల చెరువు వద్ద ప్రమాదం జరిగింది. చింతల చెరువు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

# 32 వేల రిజిస్ట్రేషన్లతో ఘనంగా 'ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్--2026'

- 15వ ఎడిషన్‌లో తొలిసారిగా ఇన్‌క్లూజివ్ రన్.. 184 మంది గిరిజన యువతకు అవకాశం
- మహిళల విభాగంలో ఎమానే సెయిఫు.. పురుషుల విభాగంలో సెబోకా నెగుస్సే విజేతలు
- భారతీయుల్లో నర్మిబెన్ ఠాకోర్, గోపీ తోనకల్ అగ్రస్థానం
- సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ సహా పలువురు ప్రముఖుల హాజరు













**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)**
రన్నింగ్ ప్రియుల్లో ఉత్సాహాన్ని నింపుతూ 15వ ఎడిషన్ ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్--2026 ఆదివారం ఘనంగా జరిగింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మారథాన్‌కు మొత్తం 32 వేల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. 5కే, ఇన్‌క్లూజివ్ రన్, 10కే, హాఫ్ మారథాన్, ఫుల్ మారథాన్ విభాగాల్లో రన్నర్లు పాల్గొన్నారు.
ప్రధాన ఈవెంట్లైన ఫుల్ మారథాన్, హాఫ్ మారథాన్, 10కే పరుగులను ఆదివారం నిర్వహించగా, 5కే, ఇన్‌క్లూజివ్ రన్‌లను శనివారం నిర్వహించారు. ఆదివారం సుమారు 11 వేల మంది హాఫ్, ఫుల్ మారథాన్, ఎలైట్ విభాగాల్లో పాల్గొనగా, మరో 9 వేల మంది 10కే రన్‌లో పాల్గొన్నారు. శనివారం జరిగిన 5కే, ఇన్‌క్లూజివ్ రన్‌లలో సుమారు 6,500 మంది పాల్గొన్నారు. వీరిలో సుమారు 300 మంది దివ్యాంగులు, 15 మంది విదేశీ, 30 మంది భారతీయ ఎలైట్ రన్నర్లు ఉన్నారు.







### 184 మంది గిరిజన యువతకు తొలిసారి అవకాశం

ఈ ఏడాది మారథాన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 184 మంది గిరిజన యువ రన్నర్లు పాల్గొన్నారు. ఎన్ఎండీసీ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోని గ్రామాలు, మారుమూల ప్రాంతాల నుంచి వీరిని ఎంపిక చేశారు.
జాతీయ స్థాయి మారథాన్‌లో తొలిసారిగా పాల్గొన్న ఈ యువ రన్నర్లకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం లభించింది. వీరిలో కొందరు ఫుల్ మారథాన్‌ను 2 గంటల 30 నిమిషాల లోపు పూర్తి చేసి తమ సత్తా చాటారని నిర్వాహకులు తెలిపారు.

### ప్రముఖుల చేతుల మీదుగా ఫ్లాగ్‌ఆఫ్

పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ వద్ద ఎలైట్ రన్నర్లు, ఫుల్ మారథాన్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ జోనల్ హెడ్ ప్రశాంత్ షిండే, ఎన్ఎండీసీ డైరెక్టర్ (పర్సనల్) కృష్ణ కుమార్ ఠాకూర్, జోనల్ డీసీపీ కె. శిల్పవల్లి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ వ్యవస్థాపకుడు, రేస్ డైరెక్టర్ రాజేష్ వెట్చా తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. హాఫ్ మారథాన్‌ను ఉదయం 5.30 గంటలకు పీపుల్స్ ప్లాజా నుంచి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.జి. కర్ణన్ తదితరులు ప్రారంభించారు.10కే రన్‌ను ఉదయం 7.15 గంటలకు హైటెక్స్, మాదాపూర్ నుంచి సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ, సీఈఓ వి. వైద్యనాథన్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు.

### ఎలైట్ విభాగంలో అంతర్జాతీయ రన్నర్ల సత్తా

మహిళల ఎలైట్ విభాగంలో ఇథియోపియాకు చెందిన ఎమానే సెయిఫు 2 గంటల 46 నిమిషాల 29 సెకన్లలో పరుగును పూర్తి చేసి విజేతగా నిలిచారు. ఇథియోపియాకే చెందిన ట్సెగా డెస్టా రెండో స్థానంలో, కెన్యాకు చెందిన టెరెసియా ఒమోసా మూడో స్థానంలో నిలిచారు.భారత మహిళల్లో నర్మిబెన్ ఠాకోర్ 2:50:20 టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచారు. ఆమె తర్వాత భాగీరథి నోన్, మీనాక్షి నేగి, మారిపల్లి ఉమ, భగవతి దాంగి నిలిచారు.
పురుషుల ఎలైట్ విభాగంలో ఇథియోపియాకు చెందిన సెబోకా నెగుస్సే 2:20:57 టైమింగ్‌తో విజేతగా నిలిచారు. కెన్యాకు చెందిన ఫెలిక్స్ కిముటై కూడా అదే టైమింగ్‌తో రెండో స్థానంలో నిలవగా, ఫ్రాన్సిస్ చెరుయియోట్ మూడో స్థానాన్ని దక్కించుకున్నారు.భారత పురుషుల్లో గోపీ తోనకల్ 2:21:46 టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలిచి అగ్ర భారతీయ రన్నర్‌గా నిలిచారు. మన్ సింగ్, ప్రదీప్ సింగ్ చౌహాన్, రంజిత్ సింగ్, బుగత శ్రీను తర్వాతి స్థానాల్లో నిలిచారు.

### హైదరాబాద్‌లో రన్నింగ్ కమ్యూనిటీ బలంగా ఉంది: డా. ఎం. రమేష్

మారథాన్ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో రన్నింగ్ కమ్యూనిటీ బలంగా ఉందన్నారు. నగరవాసుల్లో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతోందని తెలిపారు.హైదరాబాద్ దేశంలోని ప్రముఖ ఈవెంట్‌లకు కేంద్రంగా ఎదుగుతోందని, తెలంగాణ అతిథ్యానికి ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో సుమారు 2,000 మంది పోలీస్ సిబ్బంది మారథాన్‌లో పాల్గొన్నారని తెలిపారు.

### గిరిజన యువతలో ప్రతిభను గుర్తించాం: కృష్ణ కుమార్ ఠాకూర్

ఎన్ఎండీసీ డైరెక్టర్ (పర్సనల్) కృష్ణ కుమార్ ఠాకూర్ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ గ్రామీణ ప్రాంతాలకు చెందిన 184 మంది గిరిజన యువతలో అద్భుతమైన రన్నింగ్ ప్రతిభను గుర్తించామని తెలిపారు.వారిలో కొందరు ఇప్పటికే మంచి సామర్థ్యాన్ని ప్రదర్శించారని, కొందరు 2 గంటల 30 నిమిషాల లోపు ఫుల్ మారథాన్ పూర్తి చేశారని చెప్పారు. ఈ యువత ఆరోగ్యానికి రాయబారులుగా మారారని, వచ్చే ఎడిషన్లలో మరింత మంది ఉన్నత స్థాయి రన్నర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు.

### విజేతలకు భారీ నగదు బహుమతులు

విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.3 లక్షలు, రెండో స్థానానికి రూ.2.50 లక్షలు, మూడో స్థానానికి రూ.2 లక్షల నగదు బహుమతి అందించారు. నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.1.50 లక్షలు, రూ.1 లక్ష, రూ.75 వేల చొప్పున అందజేశారు.

### చారిటీ కార్యక్రమాలకు రూ.2 కోట్లకు పైగా నిధుల సమీకరణ

మారథాన్ ద్వారా చారిటీ కార్యక్రమాలకు కూడా పెద్దపీట వేశారు. మొత్తం 40 స్వచ్ఛంద సంస్థలకు ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ మద్దతు అందిస్తోంది. ఇప్పటివరకు వివిధ చారిటీ కార్యక్రమాల కోసం రూ.2 కోట్లకు పైగా నిధులు సమీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు.అత్యధిక మహిళా పాల్గొనే వారిని నమోదు చేసిన సంస్థగా నోవార్టిస్ హెల్త్‌కేర్‌ను గుర్తించారు. అత్యధిక రిజిస్ట్రేషన్లు నమోదు చేసిన సంస్థగా డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ నిలిచింది. ఆ సంస్థ నుంచి సుమారు 1,000 మంది రిజిస్టర్ చేసుకున్నారు. చారిటీ కార్యక్రమాలకు రూ.30 లక్షల విరాళం అందించినందుకు ఆర్సీసియంను గుర్తించారు.

### పర్యావరణ సుస్థిరతకు ప్రత్యేక ప్రాధాన్యం

ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ పర్యావరణ సుస్థిరతకు కూడా ప్రాధాన్యం ఇస్తోంది. గత ఏడాది ఎడిషన్‌కు వరల్డ్ అథ్లెటిక్స్ సిల్వర్ సస్టైనబిలిటీ అవార్డు లభించింది. ఈ గుర్తింపు పొందిన భారతదేశపు తొలి మారథాన్‌గా హైదరాబాద్ మారథాన్ నిలిచింది.రాబోయే మూడేళ్లలో మారథాన్‌ను కార్బన్ న్యూట్రల్ ఈవెంట్‌గా మార్చడం లక్ష్యంగా పెట్టుకున్నారు. సుస్థిరత చర్యల్లో భాగంగా 35 శాతం మంది రన్నర్లు టీ-షర్ట్ తీసుకోకుండా ఆప్ట్ అవుట్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఫ్లెక్స్, కటౌట్ల వినియోగాన్ని కూడా తగ్గించారు.

### మహిళా రన్నర్లకు భద్రతపై ప్రత్యేక దృష్టి

మహిళా రన్నర్లకు సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు, మెరుగైన సహకారం, సమగ్ర రేస్ అనుభవాన్ని అందించేందుకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్‌కు షీరేసెస్ అక్రిడిటేషన్ లభించింది.
ఈ గుర్తింపు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే, సురక్షితమైన, సమగ్ర రన్నింగ్ అనుభవాన్ని అందించాలన్న హైదరాబాద్ మారథాన్ నిబద్ధతకు మరింత బలం చేకూర్చింది.

# సైబరాబాద్‌లో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్

**●182 మందిపై కేసులు.. 154 ద్విచక్ర వాహనదారులు, 20 కార్ల డ్రైవర్లు పట్టుబాటు**

**●మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు: సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు**



సైబరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో ఆగస్టు 30 (పీపుల్స్ న్యూస్)
వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కమిషనరేట్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 182 మందిపై కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్) జి. నరేందర్ తెలిపారు.పట్టుబడిన వారిలో 154 మంది ద్విచక్ర వాహనదారులు, 7 మంది ఆటో డ్రైవర్లు, 20 మంది కార్ల డ్రైవర్లు, ఒక హెవీ వాహన డ్రైవర్ ఉన్నారు.

**బీఏసీ స్థాయిల ఆధారంగా కేసులు**
బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బీఏసీ) ఆధారంగా పరిశీలిస్తే.. 149 మంది 36 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 200 ఎంజీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ స్థాయితో పట్టుబడ్డారు. 25 మందిలో 201 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 300 ఎంజీ/100 ఎంఎల్ మధ్య, మరో 8 మందిలో 301 ఎంజీ/100 ఎంఎల్ నుంచి 550 ఎంజీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ ఉన్నట్లు పరీక్షల్లో వెల్లడైంది.పట్టుబడిన వారందరినీ చట్టపరమైన చర్యల్లో భాగంగా కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

**మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు**
మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత--2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేరానికి గరిష్టంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**వారం రోజుల్లో 308 డ్రంక్ డ్రైవింగ్ కేసుల పరిష్కారం**
ఆగస్టు 24 నుంచి 29 వరకు గత వారం రోజుల్లో 308 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వీటిలో కొందరికి జరిమానాతో పాటు జైలు శిక్ష, మరో 7 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ విధించగా, 301 మందికి జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు.మద్యం సేవించి వాహనం నడపకుండా వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముందు రాజకీయ పరిజ్ఞానం పెంచుకోవాలి

**-- పదేళ్ల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసి మాట్లాడాలి: కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్**



బాలానగర్ ఆగస్టు 31 ( పీపుల్స్ న్యూస్)
కూకట్‌పల్లి: గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎమ్మెల్యేగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు, చెరువులు, నాలాల పరిరక్షణపై నిర్లక్ష్యం వహించిన మాధవరం కృష్ణారావు.. ఇప్పుడు నియోజక వవర్గంలో 90 శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పు కోవడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ తీవ్రంగా విమర్శించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని హస్మత్‌పేట్ చెరువు, బోరబండ మైసమ్మ చెరువు, మూసాపేట్ కాముని చెరువు తదితర జలవనరుల ప్రస్తుత పరిస్థితి ప్రజలందరికీ తెలుసన్నారు. పదేళు అధికారంలో ఉన్న సమయంలో చెరువులు, నాలాలు, రహదారులు, డ్రైనేజీ తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి కృష్ణారావు తీసుకున్న చర్యలేంటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్యారాచూట్ నాయకత్వం' వ్యాఖ్యలపై మండిపాటు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ కూకట్‌పల్లి నుంచి పోటీ చేయడాన్ని మాధవరం కృష్ణారావు 'ప్యారాచూట్ నాయకత్వం'గా అభివర్ణించడం ఆయన రాజకీయ అవగాహనకు నిదర్శనమని మదన్ మోహన్ అన్నారు. గతంలో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్ ప్రాంతాలు ఉమ్మడి ఖైరతాబాద్ నియోజకవర్గంలో భాగంగా ఉన్నాయనే కనీస చారిత్రక, రాజకీయ విషయాలు కూడా తెలుసుకోకుండా కృష్ణారావు మాట్లాడటం విచారకరమన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి దేశంలో ఎక్కడైనా ఎన్నికల్లో పోటీ చేసే హక్కు కల్పించిందని, తాను పోటీ చేయదలచుకున్న నియోజకవర్గాన్ని ఎంచుకోవడం ప్రతి అభ్యర్థి రాజ్యాంగబద్ధమైన హక్కు అని స్పష్టం చేశారు. బండి రమేష్ కూకట్‌పల్లి నుంచి పోటీ చేసినంత మాత్రాన ఆయనను ప్యారాచూట్ నాయకుడిగా ఎలా అభివర్ణిస్తారని ప్రశ్నించారు.

**-- కేసీఆర్ రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకోవాలి......**
మాధవరం కృష్ణారావు ఇతరుల రాజకీయ అర్హతలను ప్రశ్నించే ముందు తన పార్టీ నాయకుల రాజకీయ ప్రయాణాన్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని మదన్ మోహన్ సూచించారు. కేసీఆర్ గతంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సందర్భాన్ని గుర్తు చేస్తూ, ఆయనను కూడా ప్యారాచూట్ నాయకుడిగా పరిగణించాలా? అని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపించినప్పుడు అకస్మాత్తుగా ప్రజల మధ్యకు వచ్చి పోటీ చేసే వారినే ప్యారాచూట్ నాయకులుగా పరిగణించవచ్చని అన్నారు. అయితే కూకట్‌పల్లి ప్రజలతో బండి రమేష్‌కు ఉన్న సంబంధాలు, నియోజకవర్గంలో ఆయన నిర్వహిస్తున్న రాజకీయ, ప్రజా కార్యక్రమాలు అందరికీ తెలుసని పేర్కొన్నారు.

**-- అభివృద్ధిపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలేనా?.......**
కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై చర్చించాల్సిన సమయంలో వ్యక్తిగత విమర్శలకు దిగడం మాధవరం కృష్ణారావు రాజకీయ బలహీనతను బయటపెడుతోందని మదన్ మోహన్ విమర్శించారు. "ముందుగా గత పదేళ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి తాను చేసిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఆ తర్వాత బండి రమేష్ రాజకీయ అర్హత గురించి మాట్లాడాలి" అని డిమాండ్ చేశారు. కూకట్‌పల్లి ప్రజలు అన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే పరిమితమయ్యే వారికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మదన్ మోహన్ హెచ్చరించారు.

# వినాయక నగర్ కాలనీ నూతన కమిటీకి బీఆర్ఎస్ పార్టీ నేతల అభినందనలు

**-- కాలనీ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సమష్టిగా కృషి చేయాలి: ఆవుల రవీందర్ రెడ్డి**



బాలానగర్ ఆగస్టు 31 ( పీపుల్స్ న్యూస్)
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలాన గర్ డివిజన్ పరిధిలోని వినాయక నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీకి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నిర్వహించిన కాలనీ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా చౌల ప్రభారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాశం శ్రీనివాస్, కోశాధికారిగా కొండోజు సతీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఆదివారం బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు ఆవుల రవీందర్ రెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నూతన కమిటీ సభ్యులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అవసరమైన చోట సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.కాలనీ సంక్షేమ సంఘం అనేది కేవలం సమస్యలను ప్రస్తావించే వేదికగా కాకుం డా, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపే బలమైన వేదికగా నిలవాలని ఆయన సూచించారు. కాలనీలో పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి, నివాసితుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. నూతన కమిటీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగాలని ఆవుల రవీందర్ రెడ్డి ఆకాంక్షించారు. నూతన కమిటీ విజయవంతంగా పనిచేసి వినాయక నగర్ కాలనీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గుండు శివాని, మధులత, మనోహర్ గౌడ్, ప్రభాకర్ గౌడ్, నాగవల్లి మహేష్, శ్రవణ్ కుమార్, గంధే నవీన్ కుమార్, రాజేష్ గౌడ్, రిషి యాదవ్, అలీ ఖాన్, మోహన్ రెడ్డి, కృష్ణ గౌడ్, కిరణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పీజీ--2026 పరీక్ష

**- పకడ్బందీ ఏర్పాట్ల మధ్య విజయవంతంగా పరీక్ష నిర్వహణ**

**- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**





విజయవాడ, ఆగస్టు 30, 2026
విజయవాడలో నీట్ పీజీ--2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టి పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, విద్యుత్, తాగునీరు తదితర అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచడంతో అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షకు హాజరయ్యారు. పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ (ఎనికేపాడు) కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు నీట్ పీజీ--2026 పరీక్ష నిర్వహించారు. రెండు పరీక్షా కేంద్రాల్లో కలిపి మొత్తం 843 మంది అభ్యర్థులకు గాను 818 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. శ్రీ విజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ పరీక్షా కేంద్రంలో 530 మంది అభ్యర్థులకు గాను 512 మంది హాజరయ్యారు. పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కేంద్రంలో 313 మంది అభ్యర్థులకు గాను 306 మంది పరీక్షకు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీ లిం చడంతో పాటు అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను, భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో అభ్య ర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేలా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థుల ప్రవేశం, పరీక్ష నిర్వహణ ప్రక్రియ, భద్రతా చర్యలను పరిశీలించిన కలెక్టర్.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిబం ధనలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# విజయవంతంగా ముగిసిన యూపీఎస్సీ సివిల్స్ మెయిన్స్ పరీక్షలు

**- ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా పరీక్షల నిర్వహణ**

**- అభ్యర్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిన యంత్రాంగం**

**- అధికారుల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ, ఆగస్టు 30, 2026



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సివిల్స్ మెయిన్స్ పరీక్షలు జరిగాయి. యూపీఎస్సీ మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టడంతో పరీక్షలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, భద్రత తదితర ఏర్పాట్లు అందుబాటులో ఉంచారు. అభ్యర్థుల ముఖ ఆధారిత గుర్తింపు ప్రక్రియను కూడా నిబంధనల ప్రకారం నిర్వహించారు. పరీక్షా కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేయడంతో పాటు, అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ప్రజా రవాణా శాఖ ఆధ్వర్యంలో అవసరమైన బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, పోస్టల్, ప్రజా రవాణా, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించారు. ఆదివారం చివరిరోజు కూడా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం యూపీఎస్సీ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ పరీక్షా విధుల్లో భాగస్వాములైన అధికారులు, సిబ్బంది, సహకరించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# ఆసియాకప్‌లో తొలి పోరుకు సిద్ధమైన భారత్.. ఎక్కడ చూడాలంటే?




మహిళల ఆసియా కప్ 2026లో టీమ్ఇండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. థాయ్‌లాండ్‌తో భారత్ తలపడనుంది. టోర్నీలో తమ స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలంటే ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం భారత జట్టుకు కీలకం. మరోవైపు థాయ్‌లాండ్ కూడా బలమైన భారత జట్టుకు గట్టి పోటీ ఇవ్వాలని చూస్తోంది.ఎప్పుడు.. ఎక్కడ మ్యాచ్?భారత్, థాయ్‌లాండ్ మధ్య మహిళల టీ20 ఆసియా కప్ మ్యాచ్ ఆగస్టు 30న జరగనుంది. మ్యాచ్ దుబాయ్ వేదికగా నిర్వహించనున్నారు. భారత కాలమానం ప్రకారం మ్యాచ్ సమయానికి సంబంధించిన అధికారిక వివరాలను ప్రసార సంస్థలు వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం అనుసరించాలి.లైవ్ ఎక్కడ చూడొచ్చు?ఈ మ్యాచ్‌ను టీవీలో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ద్వారా వీక్షించొచ్చు. మొబైల్, వెబ్ ప్లాట్‌ఫామ్‌లలో సోనీ లివ్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది.భారత్ జట్టులో ఎవరు ఉన్నారు?టీమ్ఇండియాకు అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు ప్రతిభావంతులైన యువ క్రికెటర్లు బలంగా నిలుస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌండ్ విభాగాల్లో భారత్‌కు మంచి ఎంపికలు ఉన్నాయి.భారత్ స్క్వాడ్:హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధానా, షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యస్తికా భాటియా, దీప్తి శర్మ, రేణుకా సింగ్, రాధా యాదవ్, శ్రేయాంకా పాటిల్ తదితరులు.థాయ్‌లాండ్ కూడా సిద్ధమేమరోవైపు థాయ్‌లాండ్ మహిళల జట్టు భారత్‌తో పోరుకు సిద్ధమైంది. భారత బ్యాటింగ్ లైనప్‌ను అడ్డుకోవడంతో పాటు పవర్‌ప్లేలో వికెట్లు సాధించడం ఆ జట్టుకు ప్రధాన లక్ష్యంగా ఉండనుంది.భారత బలమేంటి?టీమ్ఇండియాకు టాప్ ఆర్డర్‌లో అనుభవం పెద్ద బలం. మంధానా, షఫాలీ వంటి బ్యాటర్లు వేగంగా పరుగులు సాధిస్తే భారత్ భారీ స్కోరు చేసే అవకాశం ఉంటుంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మతో పాటు భారత బౌలింగ్ విభాగం కూడా ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచగలదు.థాయ్‌లాండ్ మాత్రం ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడితే భారత్‌కు ఇబ్బందులు సృష్టించే అవకాశం ఉంది. అందుకే ఈ మ్యాచ్‌ను టీమ్ఇండియా తేలిగ్గా తీసుకునే అవకాశం లేదు.మ్యాచ్ వివరాలు..మ్యాచ్: భారత్ జం థాయ్‌లాండ్

టోర్నీ: మహిళల టీ20 ఆసియా కప్ 2026

తేదీ: ఆగస్టు 30, 2026

వేదిక: దుబాయ్

# నేను వికెట్ టేకర్‌ని భయ్యా.. జీరో రిస్క్

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి వార్తల్లో నిలిచాడు. సాధారణంగా అతడి పేరు వినగానే భారీ సిక్సర్లు, దూకుడైన బ్యాటింగ్ గుర్తుకొస్తుంది. కానీ తాజాగా దులీప్ ట్రోఫీలో బంతితోనూ తన సత్తా చాటాడు. ఈస్ట్ జోన్ తరపున ఆడుతున్న వైభవ్.. నార్త్‌ఈస్ట్ జోన్‌తో జరిగిన క్వార్టర్‌ఫైనల్‌లో కేవలం నాలుగు బంతుల వ్యవధిలో రెండు వికెట్లు పడగొట్టాడు. మూడు ఓవర్లలో 11 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీశాడు. ఈ ప్రదర్శన అనంతరం బీసీసీఐ డొమెస్టిక్ విడుదల చేసిన వీడియోలో వైభవ్ తన బౌలింగ్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ముఖ్యంగా కెప్టెన్ ఇషాన్ కిషన్ తనకు బంతి ఇవ్వడాన్ని 'రిస్క్'గా భావించాడని చెప్పాడు. అయితే.. తనలోని అసలు బౌలర్ గురించి ఇషాన్‌కు తెలియదని నవ్వుతూ పేర్కొన్నాడు.

బ్యాట్‌తో విఫలం.. బంతితో అదరగొట్టాడు..!

నార్త్‌ఈస్ట్ జోన్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. అయితే బ్యాట్‌తో మాత్రం పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. కేవలం 6 బంతులు ఎదుర్కొని 8 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు.ఈస్ట్ జోన్ భారీ ఆధిక్యం సాధించిన తర్వాత నార్త్‌ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ వికెట్లు త్వరగా పడకపోవడంతో కెప్టెన్ ఇషాన్ కిషన్ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. యువ వైభవ్ చేతికి బంతిని అందించాడు. ఆ అవకాశాన్ని 15 ఏళ్ల ఈ క్రికెటర్ పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు.4 బంతుల్లో 2 వికెట్లు..!బంతి అందుకున్న కొద్దిసేపటికే వైభవ్ తన ప్రభావం చూపించాడు. మొదట కిషన్ లింగ్డోహ్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాత కేవలం మూడు బంతులకే ఇమ్లివతి లెమ్టుర్‌ను ఔట్ చేశాడు. దీంతో నాలుగు బంతుల వ్యవధిలోనే రెండు వికెట్లు అతడి ఖాతాలో చేరాయి.మొత్తంగా తన స్పెల్‌లో 3 ఓవర్లు వేసి 11 పరుగులు మాత్రమే ఇచ్చి 2 వికెట్లు సాధించాడు. అతడి బౌలింగ్‌తో నార్త్‌ఈస్ట్ జోన్ 75/5 నుంచి 79/7కు కుప్పకూలింది.'ఇషాన్ భయ్యా రిస్క్ తీసుకుంటున్నాడనుకున్నాడు..'

తన బౌలింగ్ గురించి మాట్లాడిన వైభవ్.. కెప్టెన్ ఇషాన్ కిషన్ తనకు బంతి ఇవ్వడాన్ని రిస్క్‌గా భావించాడని చెప్పాడు."వికెట్లు పడకపోవడంతో నాకు రెండు, మూడు ఓవర్లు బౌలింగ్ చేయమన్నారు. ఇషాన్ భయ్యా నాకు బంతి ఇవ్వడం రిస్క్ అనుకున్నాడు. కానీ.. నేను వికెట్ టేకర్‌నని ఆయనకు తెలియదు" అంటూ వైభవ్ సరదాగా వ్యాఖ్యానించాడు.'5 వికెట్లు తీసినా మూడు ఓవర్లే..'తనకు లభించిన అవకాశాన్ని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపైనే దృష్టి పెట్టినట్లు వైభవ్ చెప్పాడు."నేను ఐదు వికెట్లు తీసినా మూడు ఓవర్లకు మించి బౌలింగ్ చేసే అవకాశం




రాదని నాకు తెలుసు. అందుకే లభించిన సమయంలో సాధ్యమైనంత బాగా బౌలింగ్ చేయాలని అనుకున్నా. ఒకే ప్రాంతంలో బంతిని పదేపదే వేయాలని ప్రయత్నించా" అని వివరించాడు.బ్యాటింగ్‌లో రాణించలేకపోయిన తర్వాత బంతితో జట్టుకు సహకరించడం తనకు ఎంతో ఆనందంగా అనిపించిందని కూడా యువ ఆటగాడు చెప్పాడు. బ్యాటర్‌గా వికెట్ తీయడం ప్రత్యేకమైన అనుభూతి అని పేర్కొన్నాడు.

# ఫోర్బ్స్ ఇండియా 2026 జాబితాలో మనోళ్లే తోపులు..







భారత క్రికెటర్లకు మైదానంలోనే కాదు.. బ్రాండ్ ప్రపంచంలోనూ భారీ క్రేజ్ ఉంది. ఆటకు వీడ్కోలు పలికినా కొందరు దిగ్గజాల బ్రాండ్ విలువ ఏమాత్రం తగ్గలేదు. తాజాగా విడుదలైన ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 జాబితాలో పలువురు భారత క్రికెటర్లు చోటు దక్కించుకున్నారు. వీరిలో విరాట్ కోహ్లీ అందరికంటే ముందున్నాడు. మొత్తం భారత సెలబ్రిటీల్లోనూ అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు.నంబర్ వన్.. విరాట్ కోహ్లీభారత క్రికెటర్లలో అత్యంత విలువైన బ్రాండ్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ ఏకంగా రూ.3,542 కోట్లుగా ఫోర్బ్స్ జాబితా పేర్కొంది.కేవలం క్రికెటర్లలోనే కాదు.. దేశంలోని అన్ని రంగాల సెలబ్రిటీలను కలిపినా కోహ్లీదే అగ్రస్థానం. బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్, ప్రియాంక చోప్రా వంటి ప్రముఖులను వెనక్కి నెట్టి కోహ్లీ నంబర్ వన్‌గా నిలవడం విశేషం.క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కూడా ఈ జాబితాలో తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. మాస్టర్ బ్లాస్టర్ బ్రాండ్ విలువ రూ.1,676 కోట్లుగా నమోదైంది.అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్ అయి ఎన్నో సంవత్సరాలు గడిచినా.. సచిన్ బ్రాండ్ ప్రభావం మాత్రం కొనసాగుతూనే ఉంది. మొత్తం సెలబ్రిటీల జాబితాలో ఆయన 8వ స్థానంలో నిలిచాడు.నాలుగో స్థానంలో బుమ్రా..ప్రస్తుత తరం భారత క్రికెటర్లలో జస్‌ప్రీత్ బుమ్రా ఈ జాబితాలో అత్యంత విలువైన వారిలో ఒకడిగా నిలిచాడు. అతడి బ్రాండ్ విలువ రూ.1,142 కోట్లు.ఫోర్బ్స్ జాబితాలో బుమ్రా మొత్తం 16వ స్థానంలో ఉన్నాడు. మైదానంలో భారత పేస్ దళానికి నాయకుడిగా ఎదిగిన బుమ్రా.. వాణిజ్యంగానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు.

# మీరు ఇంగువ వాడుతున్నారా? ఎవరెస్ట్, లాల్‌జీ గోధూ బ్రాండ్లకు FSSAI బిగ్ షాక్




మీరు మీ ఆహారంలో ఇంగువను ఉపయోగిస్తుంటే, ఈ వార్త మీకు ఉపయోగపడుతుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI), రెండు కంపెనీల నుండి మిశ్రమ ఇంగువ అమ్మకాలపై నిషేధం విధించింది. ఆ కంపెనీలు ఎవరెస్ట్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాల్జీ గోధూ, కంపెనీ. పరీక్షలలో వారి ఇంగువ నమూనాలలో కొన్ని నిర్ధారిత ఆహార ప్రమాణాలకు అనుగుణంగా లేవని వెల్లడైంది.

ఈ మొత్తం వ్యవహారం ఒక వినియోగదారుడి ఫిర్యాదు తర్వాత ప్రారంభమైంది. మార్కెట్లో అమ్ముతున్న ఒక బ్రాండ్ ఇంగువ నాణ్యతను ఆ ఫిర్యాదు ప్రశ్నించింది. దీని తర్వాత, FSSAI మార్కెట్‌లోని కొన్ని ప్రముఖ ఇంగువ బ్రాండ్‌లపై దర్యాప్తును ప్రారంభించింది. ప్రాథమిక పరీక్షలలో ఎవరెస్ట్, లాల్జీ గోధూ కంపెనీల మిశ్రమ ఇంగువ నమూనాలు నాసిరకంగా ఉన్నట్లు తేలింది.

తదనంతరం ముంబైలోని ఈ రెండు కంపెనీల లైసెన్స్ పొందిన యూనిట్ల నుండి తిరిగి నమూనాలను సేకరించారు. ఈ నమూనాలను పరీక్షల కోసం ఒక ప్రయోగశాలకు పంపారు.గుజరాత్‌లోని ఉమర్‌గావ్‌లో ఉన్న మరో ఎవరెస్ట్ యూనిట్ నుండి కూడా నమూనాలను సేకరించారు. ఈ పనిలో గుజరాత్ ఆహార శాఖకు చెందిన ఒక బృందం కూడా పాలుపంచుకుంది. పరీక్షించిన తర్వాత ఈ నమూనాలు కూడా నిర్ధారిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది.

మిశ్రమ ఇంగువలో అసలైన ఇంగువ ఎంత ఉండాలి?

మిశ్రమ ఇంగువను కేవలం శుద్ధమైన ఇంగువతో మాత్రమే తయారు చేయరు. శుద్ధమైన ఇంగువను జిగురు, పిండిపదార్థం, గోధుమ పిండి వంటి పదార్థాలతో కలపడం ద్వారా దీనిని తయారు చేస్తారు. నిబంధనల ప్రకారం, ఇందులో కనీసం 5 శాతం ఆల్కహాల్‌లో కరిగే సారం ఉండాలి. మిశ్రమంలో ఉన్న శుద్ధమైన ఇంగువ పరిమాణాన్ని అంచనా వేయడానికి ఇది ఒక ప్రమాణం. అయితే, పరీక్షించిన ఉత్పత్తులలో 0 నుండి 3 శాతం మధ్య మిశ్రమ ఇంగువ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఉత్పత్తులలో కనుగొన్న గాఢతలు సిఫార్సు చేయబడిన ప్రమాణాల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయి. పర్యవసానంగా మిశ్రమ ఇంగువ ఉత్పత్తి అమ్మకాలపై ఖీుూ× నిషేధం విధించింది.ఈ దర్యాప్తు కేవలం కల్తీ చేసిన ఇంగువకు మాత్రమే పరిమితం కాలేదు. లాల్జీ గోధూ యూనిట్ నుండి తీసుకున్న ఆరు వేర్వేరు రకాల అసలైన ఇంగువ నమూనాలను కూడా పరీక్షించారు. నిబంధనల ప్రకారం.. అసలైన ఇంగువలోని పిండిపదార్థం (స్టార్చ్) 1 శాతానికి మించకూడదు. అయితే, ఈ ఆరు నమూనాలలో పిండిపదార్థం 15 నుండి 32 శాతం వరకు ఉంది. అంటే పిండిపదార్థం నిర్దేశించిన పరిమితి కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది.అసలు FSSAI ఏ చర్యలు:విచారణ అనంతరం, వివాదాస్పదమైన మిశ్రమ ఇంగువ ఉత్పత్తి అమ్మకాలను నిషేధిస్తూ ఖీుూ× ఒక ఉత్తర్వు జారీ చేసింది. ఈ చర్యను ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006 కింద తీసుకున్నారు. ఈ విషయంలో అత్యంత ముఖ్యమైన అంశం ఏమిటంటే నిర్ధారిత ప్రమాణాలకు అనుగుణంగా లేని నమూనాలు కలిగిన ఉత్పత్తులపై నియంత్రణ చర్యలు తీసుకోవడం జరిగింది. అందువల్ల ఏదైనా ఆహార ఉత్పత్తికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకునే ముందు ప్యాకేజింగ్ సమాచారాన్ని, సంబంధిత అధికారిక అప్‌డేట్‌లను సంప్రదించడం ఉత్తమం.

# మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు! తెలుగు రాష్ట్రాల్లో లేటెస్ట్ రేట్లు ఇవే



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో కనిపిస్తున్న అనిశ్చిత పరిస్థితులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నెలకొన్న అంచనాలు, డాలర్ మారకం విలువలో మార్పుల ప్రభావంతో పసిడి ధరలు మరోసారి పైకి కదిలాయి. దీంతో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లో బంగారం కొనుగోలు చేసే వారికి స్వల్ప భారం పడుతోంది.తాజా ధరల ప్రకారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,32,850గా నమోదైంది. నిన్నటితో పోలిస్తే 10 గ్రాములపై దాదాపు రూ.550 పెరుగుదల నమోదైంది. అదే సమయంలో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1,44,930కు చేరగా, గత ధరతో పోలిస్తే సుమారు రూ.600 వరకు పెరిగింది.దేశంలోని ఇతర ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నైల్లో కూడా ఇదే తరహా స్వల్ప పెరుగుదల కనిపించింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజఙ)లో ఆగస్టు డెలివరీ గోల్డ్ కాంట్రాక్టులు దాదాపు 0.4 శాతం లాభంతో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధరలు స్థిరంగా కొనసాగుతున్నప్పటికీ, భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ఉన్న ఆందోళనలు ఇన్వెస్టర్లను బంగారం వంటి సురక్షిత పెట్టుబడుల వైపు ఆకర్షిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.వెండి ధరల్లో మాత్రం పెద్దగా మార్పులు కనిపించలేదు. తెలుగు రాష్ట్రాల్లో ఒక గ్రాము వెండి ధర రూ.235గా ఉంది. 100 గ్రాముల వెండి రూ.23,516కు విక్రయిస్తుండగా, కిలో వెండి ధర రూ.2,35,000 నుంచి రూ.2,45,000 మధ్య కొనసాగుతోంది. స్థానిక పన్నులు, తయారీ ఛార్జీలు, నగరాన్ని బట్టి ధరల్లో స్వల్ప వ్యత్యాసం ఉండొచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు.బంగారం ధరలు గత కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులకు లోనవుతున్న నేపథ్యంలో కొనుగోలు చేయాలనుకునే వారు రోజువారీ ధరలను పరిశీలించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆభరణాల కొనుగోలులో బంగారం ధరతో పాటు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ వంటి అదనపు ఖర్చులు కూడా ఉంటాయని గుర్తుంచుకోవాలని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, డాలర్ బలపడటం లేదా బలహీనపడటం, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు రానున్న వెండి ధరల దిశను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా ఉండే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వావ్.. డీమార్ట్ కంటే తక్కువ ధరలు.. ఈ స్టోర్లలో సూపర్ ఆఫర్స్.. నెలకు మస్త్ పైసల్ ఆదా..



ఇంటికి కావలసిన నిత్యావసర సరుకులు అనగానే మనదేశంలో అందరికీ ముందుగా గుర్తొచ్చేది డిమార్ట్. తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులు దొరుకుతాయనే నమ్మకంతో ప్రతి నెలా అక్కడ క్యూ లైన్లలో నిలబడటం అలవాటైపోయింది. అయితే మారుతున్న డిజిటల్ యుగంలో ఆ పరిస్థితి వేగంగా మారుతుంది. మార్కెట్లోకి వచ్చిన పలు కొత్త టెక్నాలజీ యాప్‌లు, మోడరన్ రిటైల్ విభాగాలు ఇప్పుడు డిమార్ట్‌కు గట్టి సవాలు విసురుతున్నాయి. ధరల విషయంలో పోటీ పడటమే కాకుండా కస్టమర్ల సమయాన్ని ఆదా చేసే సరికొత్త వెసులుబాట్లను అందిస్తున్నాయి.

ఆన్‌లైన్ స్టోర్స్‌షాపింగ్ రంగంలో ప్రస్తుతం పెను సంచలనం సృష్టిస్తున్నవి క్విక్ కామర్స్ యాప్‌లు. ఆర్డర్ చేసిన పది నుంచి పదిహేను నిమిషాల వ్యవధిలోనే ఇంటి తలుపు తట్టే బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి యాప్‌లు, నిత్యావసర ఉత్పత్తులపై ప్రత్యేకమైన క్రాష్ డీల్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి. సమయం ఆదా కావడంతో పాటు రవాణా ఖర్చులు కూడా మిగులుతుండటంతో చాలా మంది వీటివైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు జియో మార్ట్ ఏకంగా ఎంఆర్‌పీపై 40 శాతం వరకు ఆఫర్లు ఇస్తూ, ఉచిత డెలివరీతో డిమార్ట్‌కు గట్టి పోటీనిస్తోంది. నాణ్యమైన ఆర్గానిక్ సరుకుల కోసం బిగ్ బాస్కెట్ తమ ప్రైవేట్ లేబుల్ ఉత్పత్తులపై మంచి డిస్కౌంట్లు ఇస్తుండగా.. అమెజాన్ ఫ్రెష్ , ఫ్లిప్‌కార్ట్ గ్రాసరీ పండుగలు, నెలాఖరు ఆఫర్లు, బ్యాంక్ క్యాష్‌బ్యాక్‌లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి.ఆఫ్‌లైన్ స్టోర్స్‌కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లే కాకుండా నేరుగా వెళ్లి కొనుగోలు చేసే ప్రత్యక్ష స్టోర్లలోనూ అనేక ప్రత్యామ్నాయాలు వచ్చాయి. విశాల్ మెగా మార్ట్‌లో కిరాణాతో పాటు దుస్తులు, హోమ్ అప్లయన్స్ డిమార్ట్ కంటే తక్కువ ధరలకే దొరికే సందర్భాలు ఉన్నాయి. అలాగే రిలయన్స్ స్మార్ట్ బజార్ నిర్వహించే ఒకటి కొంటే ఒకటి ఉచితం ఆఫర్లు మధ్యతరగతి జేబుకు పెద్ద ఊరటనిస్తున్నాయి. ఇక పెద్ద ఎత్తున బల్క్ కొనుగోళ్లు చేసే కుటుంబాలకు మెట్రో హోల్‌సేల్ వంటి చోట్ల దక్కే హోల్‌సేల్ రేట్లు డిమార్ట్ ధరల కంటే తక్కువగా ఉంటున్నాయి.స్మార్ట్ షాపింగ్ఒకప్పుడు తక్కువ ధర అనగానే డిమార్ట్ ఒక్కటే మార్గం అనుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. వినియోగదారులు షాపింగ్ చేసే ముందు ఆన్‌లైన్ యాప్‌లలో లభించే కార్డ్ ఆఫర్లు, ఉచిత డెలివరీ కూపన్లతో పాటు ఆఫ్‌లైన్ ఆఫర్లను పోల్చి చూసుకుంటే.. సమయంతో పాటు ప్రతినెల వేల రూపాయల బడ్జెట్‌ను సులువుగా ఆదా చేసుకోవచ్చు.

# ఆయన తినే రైస్ మనం తినలేము.



చిత్ర పరిశ్రమలో బతికినంత కాలం కింగ్ నాగార్జున లాగా బతకాలి అని ఎంతోమంది హీరోలు కోరుకుంటుంటారు. ఆయన రిచ్‌నెస్ పక్కన పెడితే, ఆయన లైఫ్‌స్టైల్, శారీరక నిర్మాణం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తాయి. నాగార్జునగారి వ్యక్తిగత మేకప్ మ్యాన్ చంద్ర, ఆయన ఆహార, ఆరోగ్య రహస్యాలను, ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ఇటీవల ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో వివరంగా పంచుకున్నారు. నాగార్జున ఆహారం విషయంలో అత్యంత క్రమశిక్షణతో ఉంటారని చంద్ర వెల్లడించారు. ఆయన వారంలో ఐదు రోజులు మామూలు ఆహారాన్నే తీసుకుంటారు, కానీ "మితంగా తీసుకోవాలి" అనే సూత్రాన్ని పాటిస్తారు. ఎక్కువగా తినరు. ఉదయం అల్పాహారంలో ఒక ఇడ్లీ, లేదా ఒక వడ, లేదా ఒక గారె మాత్రమే తీసుకుంటారని తెలిపారు. మళ్ళీ ఆకలి వేసినప్పుడే తింటారని, ఆకలి లేనిదే తినరని స్పష్టం చేశారు. చాలా మంది లాగా ఆకలి ఉన్నా లేకపోయినా దొరికింది తినేయరని చంద్ర వివరించారు.మధ్యాహ్న భోజనంలో నాగార్జునగారికి కొన్ని ప్రత్యేకమైన వంటకాలు తప్పనిసరిగా ఉండాలి. రోజూ బెండకాయ, హాట్ చిప్స్ ఆయన డైట్‌లో ఉంటాయి. అన్నం విషయంలో దంపుడు బియ్యం (పొట్టు తీయనివి) మాత్రమే తింటారు. ఇవి పాత రోజుల్లో తినే పద్ధతికి దగ్గరగా ఉంటాయని చంద్ర పేర్కొన్నారు. అన్నం చాలా మెత్తగా, దాదాపు చివిడిపోయినట్లు ముద్దగా ఉండాలని ఆయన కోరుకుంటారని, అది అందరూ తినలేరని చంద్ర నవ్వారు. దంపుడు బియ్యంతో పాటు రసం, ఒక అరటిపండు కూడా ఆయన ఆహారంలో భాగం. ఇవన్నీ కూడా తక్కువ మోతాదులోనే తీసుకుంటారని వివరించారు. శనివారం రాత్రి నుండి నాగార్జునగారికి ఇష్టమైన ఆహారం పాంప్లెట్ చేప అని చంద్ర వెల్లడించారు. అవుట్‌డోర్ షూటింగ్స్‌కు

# ఇప్పుడు అమ్మ నా పక్కన ఉంటే బాగుండేది.



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ జంటాగా నటించిన లేటెస్ట్ మూవీ చెన్నై లవ్ స్టోరీ. జూలై 24న థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలోనే ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో శ్రేయాస్ మీడియా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కథానాయిక శ్రీ గౌరీ ప్రియ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం తనకెంతో ప్రత్యేకమని, కొంత భావోద్వేగంగా ఉన్నానని ఆమె తెలిపారు. తన దివంగత తల్లిని గుర్తుచేసుకుంటూ, తన సక్సెస్ తన తల్లి చూసుంటే ఎంతో సంతోషించేవారని పేర్కొన్నారు. అయితే, తన తల్లి తనను చూస్తోందని, ఆమె ఆశీస్సుల వల్లే ఈ పేరు వచ్చిందని గౌరీ ప్రియ అన్నారు. తల్లిదండ్రుల మద్దతు లేకుండా తాను ఏదీ సాధించలేనని, తన తండ్రికి కూడా కృతజ్ఞతలు తెలిపారు."ఇంతటి మంచి పేరు, సక్సెస్ వస్తున్న ఈ సమయంలో మా అమ్మ నా పక్కన ఉండి ఉంటే ఎంతగానో సంతోషించేది. నన్ను ఇలా చూసి ఉంటే ఎంత బాగుండేదో అని చుట్టుపక్కల అందరూ అంటున్నారు. కానీ నాకు తెలుసు.. నా అమ్మ ఎప్పటికీ పైనుంచి నన్ను చూస్తూ ఆశీర్వదిస్తూనే ఉంటుంది" అంటూ భావోద్వేగానికి గురైంది.ఒక అమ్మాయి ప్రేమిస్తే ఎలా ఉంటుందో, ఆమె ప్రేమ గెలిచినా, విఫలమైనా ఆ కోణం నుండి సినిమాను చూపించాలనే ఆలోచన చేసినందుకు రచయిత సాయి రాజేష్‌కి, అలాగే తనను ఎంపిక చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అందమైన కథను అద్భుతంగా డైరెక్ట్ చేసిన రవి నంబూరికి హ్యాట్సాఫ్ చెప్పారు. సహనటుడు కిరణ్ అబ్బవరం గురించి మాట్లాడుతూ, ఒక ప్రేమకథలో రెండు పాత్రల మీద రెండున్నర గంటలు కథను నడిపించడం కష్టమైన విషయమని, కానీ కిరణ్ అద్భుతంగా నటించారని కొనియాడారు. కిరణ్‌లో ఒక మంచి స్నేహితుడిని కనుగొన్నానని, తనను ఎప్పుడూ జాగ్రత్తగా చూసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. సిరి, పూజ, మహేందర్, నవీన్, త్రిగుణ్ సహా చిత్ర యూనిట్‌లోని ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. చివరగా, ఒక తెలుగు అమ్మాయిగా, తన కెరీర్‌లో ఇంత తొందరగా ఇంత మంచి కథ, పాత్ర లభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని శ్రీ గౌరీ ప్రియ అన్నారు.

# ఎల్లమ్మలో ఈ యంగ్ హీరోయిన్ ఫిక్స్.?




తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన బలగం సినిమాతో ఒక్కసారిగా ప్రేక్షకుల మనసులు దోచేశాడు కమెడియన్ వేణు. కమెడియన్ గా ప్రస్థానం మొదలు పెట్టి సినిమాలు, టీవీ షోలు చేసి ఆ తర్వాత దర్శకుడిగా మారాడు. కెరీర్ బిగినింగ్ లో చిన్న చిన్న పాత్రల్లో కనిపించిన వేణు, ఆతర్వాత కమెడియన్ గా రాణించాడు. సినిమాలతో పాటు జబర్దస్త్ లాంటి కామెడీ షోలో ఎన్నో స్కిట్స్ చేసి నవ్వులు పూయించాడు. వేణు దర్శకుడిగా మారి చేసిన మొదటి సినిమా బలగం ఎంత పెద్ద విజయం సాదించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాకు ఏకంగా నేషనల్ అవార్డు కూడా వచ్చింది. బలగం లాంటి సినిమా చేసిన తర్వాత వేణు గ్యాప్ ఇచ్చి ఇప్పుడు ఎల్లమ్మ సినిమాతో రాబోతున్నాడు.ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నాడు రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, వీడియో గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. అయితే ఈ సినిమాలో దేవికి జోడీగా నటించే హీరోయిన్ గురించి ఆసక్తికర చర్చ జరుగుతుంది. మొదటి సారి దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తున్నారు. ఆయన పక్కన ఎవరు సెట్ అవుతారా అన్న క్యూరియాసిటీ అందరిలోనూ మొదలైంది. ఇప్పటికే ఈ సినిమాలో హీరోయిన్ గా సాయి పల్లవి నటిస్తుందని టాక్ వచ్చింది.. ఆ తర్వాత ఆమె కాదు కీర్తిసురేష్ నటిస్తుందని వార్తలు వచ్చాయి. ఆతర్వాత ఆమె కాదు మృణాల్ ఠాకూర్ ని వార్తలు వినిపించాయి. ఇక ఇప్పుడు ఓ యంగ్ హీరోయిన్ పేరు తెరమీదకు వచ్చింది.ఆహీరోయిన్ ఎవరో కాదు అనంతిక. ఈ అమ్మడు మ్యాడ్ సినిమాలో నటించి మెప్పించింది. ఆతర్వాత ఎనిమిది వసంతాలు అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు రోమాంచికం అనే సినిమా చేస్తుంది. ఇలా వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ చిన్నది. ఇప్పుడు ఎల్లమ్మ సినిమాకు సెలక్ట్ అయ్యిందని టాక్ వినిపిస్తుంది. ఇటీవలే టెస్ట్ కట్ కూడా జరిగిందని. ఆల్మోస్ట్ ఈ అమ్మడు హీరోయిన్ గా ఫిక్స్ అయ్యిందని

# కొత్తింట్లోకి అడుగుపెట్టిన టాలీవుడ్ హీరోయిన్..



టాలీవుడ్ అందాల తార, తన సహజ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి ఈషా రెబ్బా జీవితంలో ఒక మైలురాయిని సాధించారు. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా నూతన గృహంలోకి అడుగుపెట్టారు. కుటుంబ సభ్యుల సమక్షంలో అత్యంత నిరాడంబరంగా మరియు వేడుకగా ఈ గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. కొత్త ఇంటిలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈషా రెబ్బా కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శు భకార్యంలో భాగంగా ఇంట్లో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం జరిపించారు. సాంప్రదాయ వస్త్రధారణలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్న ఈషా రెబ్బా ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. సొంత ఇల్లు కట్టుకోవడం లేదా కొనుగోలు చేయడం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక పెద్ద కల అని, ఆ కల నెరవేరడం చాలా ఆనందంగా ఉందని ఆమె సన్నిహితులతో పంచుకున్నారు.ఈ గృహప్రవేశ వేడుకకు సంబంధించిన అందమైన ఫొటోలను ఈషా రెబ్బా తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ ఫొటోలలో కొత్త ఇల్లు చాలా అందంగా, ప్రశాంతమైన వాతావరణంలో కనిపిస్తోంది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు, తోటి సినీ ప్రముఖులు మరియు నెటిజన్లు ఈషా రెబ్బాకు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. "కొత్త ఇంల్లు చాలా అందంగా, ప్రశాంతమైన వాతావరణంలో కనిపిస్తోంది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు, తోటి సినీ ప్రముఖులు మరియు నెటిజన్లు ఈషా రెబ్బాకు సోషల్ మీడియాటిలోకి అడుగుపెట్టిన మీకు అభినందనలు, మీ భవిష్యత్తు మరింత ఉజ్వలంగా సాగాలి" అంటూ కామెంట్లు పెడుతున్నారు.లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈషా రెబ్బా, ఆ తర్వాత వైవిధ్యమైన చిత్రాలతో మంచి నటిగా పేరు తెచ్చుకున్నారు. కేవలం తెలుగులోనే కాకుండా ఇతర భాషా చిత్రాలలోనూ నటిస్తూ బిజీగా ఉన్న ఈషా, తాజాగా కొత్తింటికి మారడంతో ఆమె అభిమానులు మరింత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పెళ్లిపై తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పిన నందిని రెడ్డి..



తెలుగు సినీ దర్శకురాలు నందిని రెడ్డి ఓ ఇంటర్వ్యూలో తన సినీ కెరీర్, వ్యక్తిగత జీవితంపై అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. తన మొదటి సినిమా అలా మొదలైంది స్క్రిప్ట్ చెప్పే సమయం నుంచి విడుదలకు దాదాపు ఆరేళ్ల సమయం పట్టిందని, ఈ కాలం తన జీవితంలో అత్యంత కష్టమైన దశ అని ఆమె పేర్కొన్నారు. తన స్నేహితులు డాక్టర్లుగా స్థిరపడి, ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న సమయంలో తాను మాత్రం సినిమా కోసం పోరాడాల్సి వచ్చిందని, అప్పుడప్పుడు తాను తప్పు చేశానా అని కూడా అనిపించేదని నందిని రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడినప్పుడు, స్నేహితులు బిల్లులు కట్టేవారని, తాను పాకెట్ మనీ కోసం వరల్డ్ స్పేస్ కంపెనీలో రేడియో జాకీగా పనిచేసినట్లు తెలిపారు. అప్పుడు నెలకు 20,000 రూపాయలు వచ్చేదని, వాటితో తన టూ-వీలర్ పెట్రోల్ ఖర్చులు పోగా, కొంత మిగిలేదని వివరించారు. అలా మొదలైంది సినిమా కోసం మొదట 5 లక్షల రూపాయలు రెమ్యునరేషన్‌గా ఇచ్చారని, తరువాత తమిళ రైట్స్ అమ్ముడయ్యాక 20 లక్షలు అదనంగా లభించాయని ఆమె చెప్పారు. ఈ డబ్బుతో తన తల్లి పదేళ్ల పాత అప్పును తీర్చినట్లు నందిని రెడ్డి తెలిపారు. అప్పట్లో రౌడీ షీటర్లు ఇంటికి వచ్చి బెదిరించేవారని, సినిమా రిలీజ్ అయిన తర్వాత డబ్బు ఇస్తానని నమ్మకంగా చెప్పి వారిని పంపించేసి, సినిమా హిట్ అయ్యాక నిర్మాత దాము గారి నుంచి డబ్బు తీసుకొని అప్పు తీర్చినట్లు వివరించారు.

# ఆ హీరో అంటే పిచ్చి.. అతనితో మూవీ డేట్‌కు వెళ్తా



టాలీవుడ్‌లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకుపోతోంది పంజాబీ ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. 'హిట్ 2', 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', అనగనగా ఒక రాజు వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంటూ ఇండస్ట్రీలో 'లక్కీ ఛామ్'గా మారిపోయింది. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ విజయ్ దళపతి సరసన నటించి అక్కడి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ ఆచి తూచి సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. కాగా గతంలో ఈ ముద్దుగుమ్మ ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఓ ఇంటర్వ్యూలో.. "ఒకవేళ మీరు సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా 'మూవీ డేట్' (సినిమాకు వెళ్లడం) కి వెళ్లాల్సి వస్తే.. ఎవరిని ఎంచుకుంటారు?" అని యాంకర్ అడగ్గా ఆసక్తికర సమాధానం చెప్పింది.ఆ ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం తడుముకోకుండా, ఎంతో ఉత్సాహంగా కోలీవుడ్ స్టార్ హీరో శింబు పేరును చెప్పింది. "నేను మూవీ డేట్‌కు వెళ్లాలనుకుంటే ఖచ్చితంగా శింబు సార్‌తోనే వెళ్తాను" అంటూ చాలా ఎగ్జైటింగ్‌గా సమాధానం ఇచ్చింది. శింబు స్క్రీన్ ప్రెజెన్స్, ఆయన నటన అంటే తనకు చాలా ఇష్టమని ఈ బ్యూటీ పేర్కొంది. శింబుపై మీనాక్షి చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com